కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :160 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | మంగళవారం 13-10-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

‘ఫసల్ బీమా అమలు చేయాల్సిందే’..



హైదరాబాద్, అక్టోబర్ 12: 2014కు ముందు దేశంలో అనేక కుంభకోణాలు చూశామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక దళారీ వ్యవస్థ లేకుండా లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చారని తెలిపారు. ఈరోజు(సోమవారం) మీడియాతో మాట్లాడుతూ.. రోడ్లు, రైల్వే, ఎయిర్ వేస్‌ను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. తెలంగాణకు 12 ఏళ్లలో పెద్ద ఎత్తున నిధులు కేటాయించారని చెప్పారు. 41 రైల్వే స్టేషన్లను ఆధునికీకరించారని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఛాలెంజ్‌ను తాను స్వీకరిస్తున్నా అని.. ఓట్ డిలీట్ అయిన వాళ్లలో పది మందిని ఎన్నికల కమిషన్ కార్యాలయానికి తీసుకురావాలన్నారు.ఒసామా బిన్ లాడెన్ వారసులు కాంగ్రెస్ పార్టీ నేతలు అంటూ రాంచందర్ రావు విరుచుకుపడ్డారు. దేవుళ్లను ఎగతాళి చేయొద్దని.. హిందువులు ఆగ్రహంతో ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. రైతులు చనిపోతుంటే ముఖ్యమంత్రి, మంత్రులు ప్రత్యేక విమానాల్లో ఢిల్లీకి వెళ్లారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ చేసే పిచ్చి తుగ్లక్ పనులకు పోతారా అంటూ ఫైర్ అయ్యారు. తెలంగాణ ప్రజలు, రైతుల మీద ఉన్న ప్రేమ ఇదేనా రేవంత్ రెడ్డి అంటూ ప్రశ్నించారు. తెలంగాణ రైతులను ఆదుకోవాలని, ఫసల్ బీమా యోజన అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫసల్ బీమా యోజన అమలు చేయకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.కాక్రోచ్.. పిక్రోచ్ కలిసి దేశాన్ని ఏం చేయాలనుకుంటున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రశ్నించారు. త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీని తెలంగాణకు రానివ్వమన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు రాహుల్‌ను అడ్డుకుంటామని తెలిపారు. గోవాలో కాదు తెలంగాణలో డ్రగ్స్ పెరిగిపోతోందని.. నషా ముక్త్ భారత్ అనేది తెలంగాణ నుంచే ప్రారంభం కావాలని చెప్పుకొచ్చారు. జ్ఞానేష్ కుమార్‌తో బీజేపీకి ఏం సంబంధమని నిలదీశారు. నిరసనకారులపై ఎలాంటి దాడులు జరగలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముక్త్ భారత్.. త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల్లో కూడా కాంగ్రెస్ ఎక్కడా గెలవదని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీని కొత్తగా లాంచ్ చేయాలని చూస్తున్నారు కానీ ల్యాండ్ కావడం లేదంటూ ఎద్దేవా చేశారు. కేబినెట్ రద్దు చేసి మరీ.. స్పెషల్ ఫ్లైట్‌లో ఢిల్లీ వెళ్లాల్సిన అవసరం ఏముందని సీఎం సహా మంత్రులపై రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సింగూరు ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్ ఏంటి: హరీశ్ రావు



హైదరాబాద్, అక్టోబర్ 12: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు(సోమవారం) మీడియాతో మాట్లాడుతూ.. రైతు కూలీలకు డబ్బులు ఇవ్వడానికి కాంగ్రెస్‌కు మనసు లేదని మండిపడ్డారు. పంటలు వేయొద్దంటే రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రైతు కూలీలు ఎలా బతకాలి.. వలసలు పోవాలా అని నిలదీశారు. బీఆర్ఎస్ ఉన్నపుడు వలసలు వాపస్ వచ్చాయని.. ఇప్పుడు మళ్లీ వలసలు మొదలయ్యాయని విమర్శించారు.రైతులు డీజిల్ ఇంజిన్‌లు పెట్టుకుని పంటలను కాపాడుకుంటున్నారని.. ప్రతి దానికీ ఎల్‌నినోతో లింక్ పెడుతున్నారని మండిపడ్డారు. బొగ్గు లేదంటే కూడా ఎల్‌నినో అంటున్నారన్నారు. సర్కార్ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చిందని విరుచుకుపడ్డారు. దేవాదులలో మోటార్లు ఎందుకు నడపడం లేదని ప్రశ్నించారు. సింగూరు ప్రాజెక్ట్‌లో వాడుకునేందుకు రెండు టీఎంసీలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఆ నీళ్లను కూడా బీర్లు కంపెనీలకు ఇస్తున్నారని ఆరోపించారు. దసరా లిక్కర్‌కు షార్టేజ్ రావొద్దని వాళ్లకు నీళ్లు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యమని ప్రశ్నించారు. సింగూరుపై కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్ ఏంటని ప్రశ్నించారు.పంటల కోసం జూరాల గేట్లు తెరిస్తే రైతులను జైలుకు పంపారని.. తాగునీరు ఇవ్వకుండా బీర్ల కంపెనీలకు నీళ్లు ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. నీళ్లుండి కూడా ఎత్తని ప్రభుత్వం ఇది అంటూ మండిపడ్డారు. రైతులతో గంట సేపు మాట్లాడే సమయం ముఖ్యమంత్రికి లేదా అంటూ ప్రశ్నించారు. బీర్ల కంపెనీలకు నీళ్లు, ఢిల్లీలో రాజకీయాలు తప్ప ఈ ప్రభుత్వానికి ఇంకో పని లేదని హరీశ్ రావు విమర్శించారు.

మోదీ ప్రభుత్వం ఓటు చోరీ చేస్తోంది: మంత్రి ధ్వజం



ఢిల్లీ, అక్టోబరు 12 సర్(ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియ ద్వారా అర్హులైన ఓటర్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలు కేంద్ర ఎన్నికల సంఘంపై విమర్శలు చేశారు. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పిలుపుతో ఢిల్లీలో నిరసనకు దిగారు. సుప్రీంకోర్టు వరకు మార్చ్ నిర్వహించే ప్రయత్నం చేస్తామని కాంగ్రెస్ నేతలు తెలిపారు.

అర్హులైన ఓటర్లను సీఈసీ తొలగించింది: మంత్రి శ్రీధర్‌బాబు

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సర్కారుపై తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘సర్’ ఉపయోగించుకొని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించిందని.. అర్హులైన ఓటర్లను తొలగించిందని ధ్వజమెత్తారు. బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీ చేస్తోందని ఫైర్ అయ్యారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న ధర్నాలో తెలంగాణ మంత్రులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు. సర్‌ను రద్దు చేయాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పిలుపునిచ్చారని వ్యాఖ్యానించారు. సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటుందని ఆగ్రహించారు. ఎన్నికల కార్యాలయం పక్షపాతం చూపిస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ తీరును తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాహుల్ గాంధీ మల్లికార్జున ఖర్గే, పిలుపుతో ప్రజాస్వామ్య గొంతును వినిపించేందుకు తాము ఢిల్లీ వచ్చామని తెలిపారు. కేంద్రం, సీఈసీపై తమ నిరసన తెలియజేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

ఆయా రాష్ట్రాల్లో దొంగదారిన అధికారంలోకి రావాలని బీజేపీ ప్రయత్నిస్తోంది: మంత్రి శ్రీహరి

బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీ చేస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్యుడి ఓటు హక్కును కాపాడేలా తాము పోరాటం చేస్తున్నామని వ్యాఖ్యానించారు. ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ పిలుపుమేరకు తాము ఢిల్లీకి వచ్చామని వెల్లడించారు. ‘సర్’ ద్వారా ఓట్లు తొలగించి.. ఆయా రాష్ట్రాల్లో అధికారంలోకి రావాలని మోదీ సర్కార్ ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. అన్ని చోరీలు అయిపోయాయని.. ఇప్పుడు ఓట్ల చోరీ చేస్తోందని ఆగ్రహించారు. దొంగ దారిన అధికారంలోకి రావాలని బీజేపీ ప్రయత్నిస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి దుయ్యబట్టారు.

జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు ఆందోళన చేస్తాం: మహేశ్ గౌడ్

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు తాము ఆందోళన చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. మోదీ, అమిత్ షా ‘సర్’ను వాడుకొని ఎన్నికల్లో గెలిచారని ధ్వజమెత్తారు. అధికారంలో ఎప్పటికీ ఉండాలనే ఆకాంక్షతో ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆగ్రహించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు ఇంత పెద్దఎత్తున ఆందోళన చేస్తున్నా.. వారు కనీసం స్పందించట్లేదని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లాల అధ్యక్షులు అందరూ ఢిల్లీకి వచ్చి పోరాటం చేస్తున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు వరకు మార్చ్ నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటును తొలగించడం తప్పు: ఎంపీ చామల

ప్రజాస్వామ్యంలో ఓటును తొలగించడం తప్పు అని కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ బీజేపీకి వత్తాసు పలుకుతూ అక్రమాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. బీజేపీ కార్యకర్తలను ఎన్నికల కమిషనర్లుగా తీసుకువచ్చి కేంద్ర ఎన్నికల సంఘంలో కూర్చోబెట్టారని మండిపడ్డారు. 50 ఏళ్లు అధికారంలో ఉండాలనే పిచ్చి ఆలోచనతో బీజేపీ ఇలాంటి పనులు చేసిందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు.

మోదీజీ.. మీ వాళ్లు 200మంది మాతో టచ్‌లో : రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండును మరింత బలంగా వినిపించేందుకు కాంగ్రెస్ పార్టీ సోమవారం సుప్రీం కోర్టు వరకూ భారీ ర్యాలీకి తలపెట్టింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రానికి పలు ప్రశ్నలు సంధించారు. నిరసనల వేళ ఢిల్లీని ఎందుకు జైలుగా మార్చారని ప్రశ్నించారు. ‘ఓట్ల చోరీ’ అంశాన్ని లేవనెత్తేందుకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అపాయింట్‌మెంట్ కోరినా అనుమతి లభించని విషయాన్ని ఆయన ప్రస్తావించారు. సీజేఐని ఎవరు నిర్దేశిస్తున్నారని అడిగారు.సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నుంచి తనకు సందేశాలు వస్తున్నాయని రాహుల్ ఈ సందర్భంగా తెలిపారు. “ఆయన ఎంత ఒత్తిడిలో పనిచేస్తున్నారో మేం అర్థం చేసుకోగలం. ఇకనైనా అప్రూవర్‌గా మారి రాజీనామా చేయండి. అదే మీరు దేశానికి చేసే నిజమైన సేవ. అప్పుడు మేం క్షమిస్తాం” అని కాంగ్రెస్ ఎంపీ పేర్కొన్నారు.

ఢిల్లీని జైలుగా మార్చారెందుకు..?

“భాజపా కు దేశ ప్రజల్లో 12 ఏళ్లుగా వ్యతిరేకత ఉంది. ఇప్పుడది ఒక స్పష్టమైన రూపం దాల్చుతోంది. కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనల వేళ ఢిల్లీలో ఒక భయానక వాతావరణాన్ని సృష్టించారు. నగర రోడ్లపై దాదాపు 30వేల మంది పోలీసులను మోహరించారు. దేశ రాజధానికి రాకుండా అడ్డుకుంటున్నారు. మొత్తం ఢిల్లీ ని కోటగా, జైలుగా మార్చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? ఆర్ఎస్ఎస్ గూండాలకు ఉన్న స్వేచ్ఛ.. యువతకు ఎందుకు లేదు? మహిళలపై భాజపా, ఆర్ఎస్ఎస్ గూండాలు దాడులు చేస్తున్నారు. ప్రస్తుత పరిణామాలతో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని మాకు తెలుసు. ఆయన రాజీనామా చేయాల్సిందే. అప్పటివరకు మేం వదిలిపెట్టబోం” అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

సుప్రీంకు వెళ్తాం..

“దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని.. భారత ప్రధాన న్యాయమూర్తికి చెప్పాలని భావించాం. ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలను సీజేఐ దృష్టికి తీసుకెళ్లాలనుకున్నాం. అందుకోసమే ఆయన అపాయింట్‌మెంట్ కోరాం. కానీ, మా విజ్ఞప్తిని సీజేఐ తిరస్కరించారు. సుప్రీం కోర్టులో పిటిషన్ వేసుకోవాలని అన్నారు. అందుకే నేడు అత్యున్నత న్యాయస్థానం వరకు ర్యాలీగా వెళ్తున్నాం. జ్ఞానేశ్ కుమార్‌పై సుప్రీంలో పిటిషన్ వేస్తాం” అని రాహుల్ వెల్లడించారు.“ప్రస్తుతం ప్రజలు, ప్రతిపక్షాలన్నీ ఒకవైపు ఉంటే.. మోదీ, అమిత్ షా, అజిత్ ధోబాల్, జ్ఞానేశ్ కుమార్, మోహన్ భాగవత్ మరోవైపు ఉన్నారు. వారు ప్రజాస్వామ్యాన్ని చంపేస్తున్నారు. మోదీకి నేను చెప్పేది ఒక్కటే.. మీ ప్రభుత్వంలోని 200 మంది అధికారులు మాతో టచ్‌లో ఉన్నారు. ఇది మోదీ-రాహుల్ మధ్య జరిగే యుద్ధం కాదు. దేశ యువత భవిష్యత్తు, రాజ్యాంగాన్ని రక్షించడం కోసం జరుగుతున్న పోరాటం. ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది. ఆ ఐదుగురు నేరగాళ్లు న్యాయవిచారణ ఎదుర్కొనే వరకు వదిలిపెట్టేది లేదు” అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

ఎన్నికల్లో ఓటమి భయంతోనే మోదీ సర్కార్ ‘సర్’ ను అమలు చేస్తోంది..



ఢిల్లీ, అక్టోబరు 12 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ సర్కారుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్, బిహార్, మహారాష్ట్రలో సర్ (ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ) ఎక్కడ తీసేశారో అక్కడ బీజేపీ గెలుస్తోందని ధ్వజమెత్తారు. మతాలు, ప్రాంతాల మధ్య బీజేపీ చిచ్చు పెడుతోందని దుయ్యబట్టారు. మనుగడ లేని రాష్ట్రాల్లో ఇతర పార్టీలు గెలుస్తున్నాయని వెల్లడించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. సీఈసీ ఎంపికలో సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తిని తొలగించారని ప్రస్తావించారు. ఈరోజు (సోమవారం) ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న ధర్నాలో సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ మంత్రులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు.

జనాభా పెరుగుతుంటే ఓట్లు ఎలా తగ్గుతున్నాయి..?

2014లో 81 కోట్ల ఓట్లు వచ్చాయని.. 2019లో 91 కోట్ల ఓట్లు, 2023లో 97 కోట్ల ఓట్లు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. ఇప్పటికే 13 కోట్ల ఓట్లు తొలగించారని, ఇప్పుడు ఉన్న జనాభా ఎంత అని ప్రశ్నించారు. జనాభా పెరుగుతుంటే ఓట్లు ఎలా తగ్గుతున్నాయి..? అని నిలదీశారు. ఈ విషయంలో ఎవరు సమాధానం చెబుతారని అడిగారు. రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎవరు కూడా మోదీకి ఈ విషయం గురించి ఎందుకు చెప్పట్లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. బీజేపీ రెండు వర్గాలను తయారు చేస్తోందని.. అనుకూలం ఉన్న వారికి ఓట్లు, ఇతరులను ఓట్లులేని వారిగా తయారు చేస్తోందని ధ్వజమెత్తారు. దేశంలోని పౌరులను మోదీ సర్కార్ రెండు రకాలుగా విడగొడుతోందని మండిపడ్డారు. ఓటు హక్కు కోల్పోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

దేశంలో శాశ్వత విభజనను బీజేపీ తీసుకొస్తోంది..

దేశంలో శాశ్వత విభజనను బీజేపీ తీసుకొస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. సీఈసీపై మరో స్వతంత్ర పోరాటం జరుగుతోందని వెల్లడించారు. జ్ఞానేశ్ గో బ్యాక్ పేరుతో తమ ఆందోళన కొనసాగుతోందని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సర్ వ్యతిరేక పోరాటం, మరో స్వతంత్ర పోరాటమేనని.. సైమన్ గో బ్యాక్ పోరాటం లాగే తాము పోరాటం చేస్తామని అన్నారు. ఇన్నాళ్లు సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలను ఉపయోగించి ప్రత్యర్థులను అణిచివేశారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలవదనే అభిప్రాయంతో ‘సర్’ను అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తమకు ఓటు వేయని వారి ఓట్లను ‘సర్’ పేరుతో తొలగిస్తున్నారని ఆగ్రహించారు.

ఏఐను ఉపయోగించి బీజేపీ వ్యతిరేక ఓట్లు తొలగిస్తున్నారు..

ఏఐను ఉపయోగించి బీజేపీ వ్యతిరేక ఓట్లు తొలగిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మోదీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న యువత ఓట్లను కూడా తొలగిస్తున్నారని ఫైర్ అయ్యారు. మోదీ ఎందుకు జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడుతున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఓట్లను తొలగించి పశ్చిమబెంగాల్, బిహార్, హరియానాలో గెలిచారని ధ్వజమెత్తారు. ఓటు లేకపోతే ఏ పార్టీ పేదలను పట్టించుకోదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆర్టీసీ -మెట్రో కామన్ పాస్ ఛార్జీల పునఃపరిశీలన



హైదరాబాద్::ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ – మెట్రో కామన్ పాస్ ఛార్జీలను పునఃపరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కామన్ పాస్ ఛార్జీలు అధికంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి వరుసగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రజల అభిప్రాయాలను, వాస్తవ పరిస్థితులను నమోక్షిస్తున్నామని వెల్లడించారు.ప్రస్తుతం అమల్లోకి తీసుకొచ్చిన కామన్ పాస్ ధరలు రోజువారీ పాస్‌కు రూ.400 కాగా, ఇందులో మెట్రో వాటా రూ.300, ఆర్టీసీ వాటా రూ.100గా ఉంది. అదేవిధంగా నెలవారీ కామన్ పాస్ ధర రూ.8,500 కాగా, ఇందులో మెట్రో వాటా రూ.7,000, ఆర్టీసీ వాటా రూ.1,500గా నిర్ణయించారు.అయితే ఈ ఛార్జీలు సామాన్య ప్రజలకు భారంగా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నూచనల మేరకు ఛార్జీలను పునఃపరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించి, ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆర్టీసీ – మెట్రో కామన్ పాస్ ధరలను నిర్ణయించే అంశంపై త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు ఆర్టీసీ, మెట్రో సేవలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకునేలా చూడటమే



సంపాదకీయం

మంగళవారం 13-10-2026

రైతుకు సమాచార సాయం

ప్రధాని మోదీ అధ్యక్షతన ఇటీవల జరిగిన ప్రగతి సమీక్షలో 'అగ్రిస్టాక్'పై చర్చించడం ప్రాధాన్యం సంతరించుకుంది. వ్యవసాయ డేటా నుంచి మరింతగా ప్రయోజనం పొందడానికి ఏఐ వంటి సాంకేతికతలను వినియోగించాలని ప్రధాని సూచించారు. ఇంతవరకు రైతుల పేర్ల నమోదు, పంట వివరాల సేకరణ, భూసమాచార అనుసంధానతపైనే ప్రధానంగా దృష్టి సారిస్తూ వచ్చారు. 'అగ్రిస్టాక్' కింద ఆ సమాచారాన్ని రైతుల ప్రయోజనార్థం ఉపయోగించడం, వ్యవసాయ స్థితిగతుల గురించి ప్రభుత్వాలు ముందస్తుగానే సరైన అవగాహన తెచ్చుకోవడమే ఇప్పుడు జరగాల్సిఉంది.వ్యవసాయానికి నీరు, విత్తనం, ఎరువు, యంత్రాలు ఎంత అవసరమో సమాచారమూ అంతే కీలక వనరుగా మారుతోంది. ఈ క్రమంలో భూరికార్డుల కంప్యూటరీకరణ, ఆధార్, ప్రత్యక్ష నగదు బదిలీ, పీఎం-కిసాన్, ఈ-నామ్, పంటల బీమా, ఉపగ్రహ ఆధారిత పంట అంచనా వంటి వ్యవస్థలను రైతు కేంద్రంగా అనుసంధానించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీన్నించే 'అగ్రిస్టాక్' రూపుదిద్దుకుంది. 2023-24 బడ్జెట్‌లో వ్యవసాయ డిజిటల్ ప్రజామౌలిక వసతుల ప్రకటన తరవాత కేంద్రం రూ.2,817 కోట్లతో డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌కు ఆమోదం తెలిపింది. దాంతో రైతుల పేర్ల నమోదు, భౌగోళిక గుర్తింపుతో గ్రామ భూపటాలు, పంటల నమోదు వ్యవస్థను రాష్ట్రాలే రూపొందించి, నిర్వహిస్తున్నాయి. ఇలా మొన్న ఆగస్టు వరకు దేశవ్యాప్తంగా 10.31 కోట్లకు పైగా రైతు గుర్తింపు సంఖ్యలు రూపొందాయి. 2025-26 రబీ సీజన్‌లో 648 జిల్లాల్లో 31.3 కోట్లకుపైగా పొలాల్లో డిజిటల్ పంట సర్వే చేపట్టారు. 'యెస్-టెక్' కార్యక్రమం కింద ఏఐ, మెషీన్ లెర్నింగ్, డిజిటల్ జనరల్ క్రాప్ ఎస్టిమేషన్ సిస్టమ్‌లను ఉపయోగించి వరి, గోధుమ, సోయాబీన్ దిగుబడులను అంచనా వేస్తున్నారు. రుణాలు, పంటల బీమా, వాతావరణ సలహాలు, కనీస మద్దతు ధరలకు కొనుగోళ్లు వంటి సేవలను ఈ వ్యవస్థతో క్రమంగా అనుసంధానిస్తున్నారు. అయితే, ఈ కొత్త వ్యవస్థను రైతులకు ఉపయోగపడేలా ఎలా మలచాలన్నదే ప్రశ్న! కేంద్రం మొన్నటి పద్దులో 'అగ్రిస్టాక్' కార్యక్రమాలకు దాదాపు రూ.13వేల కోట్లు ప్రత్యేకించింది. ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాల్సి ఉంది.

కౌలుదారుల గుర్తింపే కీలకం...

ఐరోపాతో పాటు కెన్యా, ఇథియోపియా వంటి దేశాల అనుభవాలు చెప్పేది ఒక్కటే- 'రైతుల నమోదు మొదటిమెట్టు మాత్రమే; ఆ సమాచారం ఆధారంగా వారికి సేవలు అందించినప్పుడే నిజమైన ప్రయోజనం సిద్ధిస్తుంది.' భారత్ ఇలాంటి ప్రపంచవ్యాప్త అనుభవాలను పరిగణనలోకి తీసుకుంటూనే తనదైన డిజిటల్ వ్యవసాయ వసతిని నిర్మిస్తుండటం విశేషం. 'అగ్రిస్టాక్' ఆధారంగా ఎరువుల పంపిణీని మెరుగుపరిచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే పంట విస్తీర్ణం, పంట దశ, నేల సారం, స్థానిక నిల్వలను కలిపి విశ్లేషించడం ద్వారానే ఎరువుల అవసరమెంతో కచ్చితంగా అంచనా వేయడం సాధ్యమవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో కీలకమైన అంశం- యాజమాన్య హక్కులకు భంగం వాటిల్లకుండా కౌలు రైతులను గుర్తించడం. 'అగ్రిస్టాక్'లో కౌలు రైతులు, లీజుదారులను చేర్చే అవకాశముంది. ఇది సరిగ్గా అమలైతే బీమా, పరిహారం, సలహాలు వాస్తవ సాగుదారులకు చేరతాయి. పంటల డిజిటల్ సర్వే, ఉపగ్రహ చిత్రాలు, వర్షపాతం, నేలలో తేమను కలిపి విశ్లేషిస్తే పంట నష్టాన్ని వేగంగా గుర్తించవచ్చు. ఇలాంటి డేటా జిల్లాలవారీ ఉత్పత్తి అంచనాలకూ ఉపయోగపడుతుంది. కొనుగోలు కేంద్రాలు, గోదాములు, రవాణా సదుపాయాలను సిద్ధం చేసుకోవడానికీ తోడ్పడుతుంది.తెలుగు రాష్ట్రాల్లో వాతావరణ, ఉపగ్రహ, మార్కెట్ సమాచారం, భూరికార్డులు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు చేయాల్సిందల్లా వేర్వేరు శాఖల దగ్గర ఉన్న సమాచారాన్ని సరైన నిర్ణయాలు తీసుకోవడానికి వీలుగా క్రోడీకరించి, విశ్లేషించడమే. ఇందుకు ఇక్రిశాట్ వంటి సంస్థల తోడ్పాటు ఉపకరిస్తుంది. ఇందులో వ్యవసాయ పరిశోధన సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు సంస్థలనూ భాగస్వామ్యం చేయవచ్చు. 'అగ్రిస్టాక్'ను విలువ గొలుసులతో అనుసంధానించడం ద్వారా ప్రాసెసింగ్, నిల్వ, రవాణా, ఎగుమతి ప్రణాళికలను సిద్ధం చేసుకోవచ్చు. ఇటువంటి విశ్వసనీయ డేటా ఆధారంగా బ్యాంకులు, బీమా సంస్థలు చిన్న, కౌలురైతులకు రుణాలిచ్చే అవకాశం ఉంటుంది. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, మహిళా సంఘాలు, గ్రామీణ యువతను కూడా అనుసంధానిస్తే, గ్రామీణ ఉపాధికి మద్దతిచ్చే ఒక సమగ్ర మౌలిక వసతిగా 'అగ్రిస్టాక్' అవతరించగలదు.

తెలుగు రాష్ట్రాలు చేయాల్సిందేంటి?

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు తక్షణ ప్రయోజనం కలిగించే కీలక సమస్యలపై దృష్టి పెట్టాల్సి ఉంది. తెలంగాణలో ఎరువుల ముందస్తు అంచనా, కౌలురైతు గుర్తింపు, పంట ప్రమాదాల హెచ్చరికలు అవసరం. ఏపీలో తుపాను-కరవు ప్రమాదాల అంచనా, ఉత్పత్తి అంచనా, కొనుగోలు ప్రణాళిక, కౌలురైతు సేవలపై దృష్టి పెట్టాలి. వ్యవసాయ, రెవెన్యూ, ఐటీ, మార్కెటింగ్, సహకార, బీమా శాఖలు వేర్వేరుగా కాకుండా, సమన్వయ బృందంగా పనిచేయాల్సి ఉంది. వ్యవసాయ పరిశోధన సంస్థల సహకారంతో సమస్యలవారీగా ప్రాజెక్టులను రూపొందించి, కేంద్రం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలి. ఇందుకు ప్రతి రాష్ట్రం ఒక 'అగ్రిస్టాక్' కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలి. 'అగ్రిస్టాక్' అసలు శక్తి రైతుల వివరాలను సేకరించడంలో కాదు- ఆ డేటాను డిజిటల్ మేధగా మార్చుకోవడం, తద్వారా వారి సమస్యలను పరిష్కరించడంలో ఉంది. ఎరువుల అవసరాన్ని ముందే అంచనా వేయడం, కౌలురైతును వ్యవస్థలో భాగం చేయడం, పంట నష్టాన్ని సమయానికి గుర్తించడం, దిగుబడులు మార్కెట్‌కు రాకముందే ప్రభుత్వాన్ని అప్రమత్తం చేయడం, ప్రతి పొలానికి తగిన సలహాలను సరైన సమయంలో అందించడం- వంటివన్నీ డిజిటల్ మేధతో సాధ్యమవుతాయి. డేటా నమోదు వ్యవస్థ నుంచి నిర్ణయ మేధా వ్యవస్థగా 'అగ్రిస్టాక్' మారినప్పుడే దాని అసలు సామర్థ్యమేంటో తెలియవస్తుంది. 'అగ్రిస్టాక్'ను మరో ప్రభుత్వ డేటాబేస్‌గా కాకుండా, రైతుకు ఉపయోగపడే వ్యవసాయ సేవల మౌలిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే- ఇప్పుడు చేయాల్సింది!

నాలుగేళ్ల జాప్యం.. రూ.9,697 కోట్ల భారం!



మంచిర్యాల:మంచిర్యాల జిల్లా పెగడపల్లిలో సింగరేణి సంస్థ నిర్మిస్తున్న 800 మెగావాట్ల సామర్థ్యం గల సింగరేణి థర్మల్ ప్లాంట్ అంచనా వ్యయం భారీగా పెరిగింది. ప్రారంభంలో వేసిన లెక్కలతో పోలిస్తే ప్రస్తుతం ప్రాజెక్టు ఖర్చు గణనీయంగా పెరగడం తీవ్ర చర్చకు దారితీసింది. 2024-25 గణాంకాల ప్రకారం ఈ ప్లాంట్ నిర్మాణం కోసం రూ. 9,697 కోట్లు ఖర్చవుతాయని అధికారులు అంచనా వేశారు. గతంలో ప్రతీ మెగావాట్ ఉత్పత్తికి రూ. 10.80 కోట్ల పెట్టుబడి అవసరం అవుతుందని భావించారు. ప్రస్తుతం ఆ మొత్తం రూ. 11.99 కోట్లకు పెరిగింది. ప్లాంట్ నిర్మాణం పూర్తి కావడానికి మరో నాలుగేళ్ల సమయం పడుతుంది. ఈ జాప్యం వల్ల భవిష్యత్తులో నిర్మాణ ఖర్చులు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ప్రాజెక్టు నిధుల కోసం విద్యుత్ ఆర్థిక సంస్థల నుండి 75 శాతం రుణాలు తీసుకోవాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది.

కరెంట్ బిల్లుల మంట.. యూనిట్ ధర ఎంతంటే?

ఈ ప్లాంట్‌లో తయారయ్యే విద్యుత్ కోసం మొదటి ఏడాది యూనిట్‌కు రూ. 5.61 ఖర్చవుతుందని తెలంగాణ డిస్కంలు స్పష్టం చేశాయి. విద్యుత్ సరఫరా లైన్ల అద్దె కింద యూనిట్‌కు రూ. 0.60 అదనంగా చెల్లించాలి. అంటే మొత్తంగా ఒక యూనిట్ విద్యుత్ ధర రూ. 6.21 కి చేరుతుంది. జాతీయ సౌర విద్యుత్ సంస్థ ఇటీవల నిర్వహించిన టెండర్లలో బహిరంగ మార్కెట్ విద్యుత్ ధర యూనిట్‌కు రూ. 5.25 గా నమోదు కావడం గమనార్హం. సౌర విద్యుత్ తక్కువ ధరకే లభిస్తున్న నేపథ్యంలో థర్మల్ విద్యుత్ కొనుగోలుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే నిరంతర సరఫరా, సాంకేతిక విశ్వసనీయత కారణాల వల్ల థర్మల్ విద్యుత్ కొనుగోలు అవసరమని అధికారులు చెబుతున్నారు. కొనుగోలు ప్రతిపాదనపై విద్యుత్ నియంత్రణ మండలి అక్టోబర్ 29న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనుందిఈ ప్లాంట్ నిర్వహణకు ఒడిశాలోని నైనీ గని నుంచి ఏటా 40 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయాలని సింగరేణి నిర్ణయించింది. దాదాపు 800 కిలోమీటర్ల దూరం నుండి బొగ్గు తెప్పించడం వల్ల రవాణా ఖర్చులు విపరీతంగా పెరగనున్నాయి. స్థానికంగా ఉన్న సింగరేణి గనుల్లో తగినంత నాణ్యమైన బొగ్గు లభించకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. ప్లాంట్ నీటి అవసరాల కోసం గోదావరి నది నుంచి ఒక టీఎంసీ, ప్రాణహిత పంప్‌హౌస్ నుంచి రెండు టీఎంసీల నీటిని కేటాయించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాల విద్యుత్ అవసరాలను తీర్చడానికే ఈ ప్లాంట్‌ను రూపొందించారు. పెరుగుతున్న నిర్మాణ వ్యయం, బొగ్గు రవాణా భారం చివరికి సాధారణ వినియోగదారుల బిల్లులపై ప్రభావం చూపే అవకాశం ఉందో లేదో త్వరలో తేలనుంది.

ఎన్నికల వ్యవస్థపై పోరాటం - చేతకానితనమే!



న్యూఢిల్లీ."ఒక మనిషి శరీరంలో ఏదైనా అవయవం గాయపడితే, ఆ అవయవానికి చికిత్స చేసి నయం చేయడానికి ప్రయత్నిస్తాం తప్ప... దాన్ని నరికి పారేయాలని ఎవరు అనుకోరు. ప్రజాస్వామ్య వ్యవస్థలైనా అంతే!"ప్రజాస్వామ్య వ్యవస్థల్లో లోపాలు, వివాదాలు రావడం సహజం. భారతదేశం లాంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో అత్యంత కీలకమైన బాధ్యత నిర్వర్తించే ఎన్నికల సంఘం సైతం ఇందుకు మినహాయింపు ఏమీ కాదు. అయితే, ఏదైనా లోపం కనిపించినంత మాత్రాన , ఎన్నికల నిర్వహణలో అభిప్రాయ భేదాలు తలెత్తినంత మాత్రాన... శతాబ్దాలుగా ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంగా నిలిచిన ఒక రాజ్యాంగ వ్యవస్థ విశ్వసనీయతనే పునాదులతో సహా తవ్వి తీయాలని చూడటం అత్యంత ప్రమాదకరం. అంతర్గతంగా ఏ వ్యవస్థలోనైనా తప్పులను నిలువరించేందుకు చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ రాజ్యాంగబద్ధంగానే ఉంటాయి. ఎన్నికల సంఘం చుట్టూ తిరుగుతున్న వివాదాలను, నడుస్తున్న ఆధిపత్య పోరాటాలను కూడా అదే దృక్కోణంలో చూడాలి తప్ప, ఎన్నికల ప్రక్రియనే నాశనం చేసే కుట్రగా మార్చడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. దురదృష్టవశాత్తూ భారత్‌లోని విపక్ష కాంగ్రెస్ కూటమి అదే చేస్తోంది.

అపోహలు - వివాదాల అసలు రంగు

ప్రస్తుతం ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకం నుంచి మొదలుకొని, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వరకు ప్రతి చిన్న అంశం రాజకీయ వివాదాలకు ఆజ్యంగా మారుతోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ , ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుండి భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టంపై నేడు తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు సూచన మేరకు పార్లమెంట్ ద్వారా ఒక చట్టాన్ని తీసుకురావాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. ఆ చట్టంలో సీజేఐ ప్రాతినిధ్యం ఉండేలా చూస్తే వ్యవస్థకు మరింత తటస్థత వచ్చేదన్న మాట వాస్తవమే. కేంద్రం అలా చేయకుండా పార్లమెంట్ అత్యధిక మెజారిటీతో ఈ చట్టాన్ని ఆమోదించింది.ఇది పార్లమెంట్ చేసిన రాజ్యాంగబద్ధమైన చట్టం. దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. విచారణ జరుగుతోంది కూడా. కానీ, చట్టంలోని నియమాలను బూచిగా చూపిస్తూ, కమిషనర్ల మధ్య ఉండే అంతర్గత అభిప్రాయ భేదాలను ఆధారంగా చేసుకుని, కమిషన్ మొత్తాన్నే ప్రధాన రాజకీయం వైపు నెట్టడం సమంజసమా?. ఇక్కడ అసలు విషయమేమిటంటే... ఎన్నికల సంఘం అనేది మ్యాచ్‌ను నిర్వహించి ఫలితాలు ప్రకటించే అంపైర్ లాంటిది మాత్రమే. గ్రౌండ్‌లో ఆడేది రాజకీయ పార్టీలు, తీర్పు ఇచ్చేది ప్రజలు. ఎన్నికల సంఘం అనుకుంటే ఫలితాలను మార్చేస్తుందని అనుకోవడం, పక్షపాతం చూపిస్తుందని చెప్పడం కేవలం అపోహ మాత్రమే. అది అసాధ్యమని విమర్శలు చేసే రాజకీయ పార్టీలకూ లోపల బాగా తెలుసు. కానీ, ప్రస్తుత విపక్షాలు ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై విమర్శలు గుప్పిస్తూ, ఆయన రాజీనామాను తమ ప్రధాన రాజకీయ ఎజెండాగా మార్చుకున్నాయి. సీఈసీతో రాజీనామా చేయించడం ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని మానసికంగా, రాజకీయంగా బలహీనపరిచామని చెప్పుకోవడానికి ఇదొక పొలిటికల్ టార్గెట్ గా మారింది.

ఆధిపత్య పోరాటాలు కొత్తవేమీ కావు!

చరిత్ర తిరగేస్తే, ఎన్నికల సంఘంలో కమిషనర్ల మధ్య వివాదాలు లేదా విభేదాలు రావడం ఇదే మొదటిసారి కాదు. ఇంట్లో నలుగురు అన్నాదమ్ములు ఉంటే గొడవలు రావడం సహజం... అంతమాత్రాన ఇల్లు కూల్చుకోరు కదా!. 1990ల కాలంలో టి.ఎన్. శేషన్ సింగిల్ మెంబర్ కమిషన్‌ను మల్టీ-మెంబర్ కమిషన్‌గా మార్చినప్పుడు తలెత్తిన ఘర్షణలు, ఆ తర్వాత ఎం.ఎస్. గిల్, జి.వి.జి. కృష్ణమూర్తిల మధ్య నడిచిన సుదీర్ఘ ఆధిపత్య పోరాటం, లేదా 2009లో అప్పటి సీఈసీ ఎన్.గోపాలస్వామి తన తోటి కమిషనర్ నవీన్ చావ్లాపై వేటు వేయాలని రాష్ట్రపతికి సిఫార్సు చేసిన ఘటన... ఇవన్నీ ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలకు నిదర్శనాలు. గతంలో అశోక్ లవాసా కూడా తన విభేదాభిప్రాయాలను రికార్డు చేశారు. ఇవన్నీ వ్యవస్థలోని ప్రజాస్వామ్య స్ఫూర్తిని, అభిప్రాయ స్వేచ్ఛను చూపించే చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ మాత్రమే. అంతర్గత విభేదాలు ఉన్నంత మాత్రాన వారు నిర్వహించిన ఎన్నికలను రద్దు చేయాలని కానీ, కమిషన్ ఉనికినే రద్దు చేయాలని కానీ ఆనాడు ఏ రాజకీయ పార్టీ డిమాండ్ చేయలేదు. కానీ, నేడు విపక్షాలు ఏకంగా ఎన్నికల చెల్లుబాటునే ప్రశ్నించే స్థాయికి వెళ్లాయి. ఇక్కడే అసలు ఓటమి రాజకీయం దాగి ఉందనేది స్పష్టమవుతోంది.

ఈవీఎంలు, SIR ప్రక్రియపై నిందలు - చేతకానితనానికి ముసుగు

ఎన్నికలు ముగియగానే దేశంలో ఒక విచిత్రమైన సంప్రదాయం నడుస్తోంది. ఆడలేక మద్దెల ఓడు అన్నట్లుగా... ఓడిపోయిన ప్రతిసారీ పార్టీలు ముక్తకంఠంతో ఈవీఎంలను, ఓటర్ల జాబితాలను, ఎన్నికల సంఘాన్ని నిందించడం పరిపాటిగా మారింది. అదే పార్టీ రేపు వేరే రాష్ట్రంలోనో లేదా తదుపరి ఎన్నికల్లోనో గెలిస్తే... ఈవీఎంలు అద్భుతంగా పనిచేసినట్లు, ప్రజాస్వామ్యం గెలిచినట్లు సంబరాలు చేసుకుంటాయి. ఇవాళ గెలిచిన పార్టీ రేపు ఓడిపోతే ఈవీఎంలనే నిందిస్తుంది. అంటే, ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల సంఘాన్ని తమ రాజకీయ అవసరాలకు వాడుకునే ఒక పొలిటికల్ టూల్ గా మార్చేసింది. ఇక ఇప్పుడు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కూడా పెద్ద ఎత్తున ఆరోపణలు చేస్తున్నారు.బోగస్ ఓట్ల తొలగింపు, అర్హులైన కొత్త ఓటర్ల చేరిక కోసం నిరంతరం నడిచే సాధారణ సాంకేతిక ప్రక్రియను సైతం పొలిటికల్ కుట్రగా చిత్రీకరించే యత్నం జరుగుతోంది. ఒక్కసారి నిజాయితీగా ఆలోచిద్దాం... సర్ ప్రక్రియ వల్ల తమ ఓట్లు అన్యాయంగా పోయాయని చెప్పి రోడ్డెక్కిన సగటు పౌరులు ఎవరైనా ఉన్నారా? నిజంగానే వేలాది మంది, లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేరు తొలగించి ఉంటే... బాధితులతో కలిసి విపక్షాలు ఎందుకు ప్రజా ఉద్యమాలను నిర్మించడం లేదు? ప్రజాక్షేత్రంలో హోరాహోరీ పోరాటాలు చేసి, ఎన్నికల సంఘం తప్పును ఆధారాలతో సహా ఎందుకు ఎండగట్టడం లేదు? అలా ప్రజా పోరాటాలు చేయకుండా, కేవలం ప్రెస్ మీట్లకు, సోషల్ మీడియా వేదికలకు పరిమితమై ఆరోపణలు చేయడం వల్ల వారు చెప్పే మాటల్లో నిలకడ లేదని అర్థమవుతోంది.

ప్రజాస్వామ్య పునాదులను బలహీనపరిచే ప్రమాదకర క్రీడ

ముఖ్యంగా కాంగ్రెస్ సహా కొన్ని ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ వరుస ఓటములకు ప్రజల తీర్పు కారణం కాదు, ఎన్నికల సంఘం , ఈవీఎంల మేనేజ్‌మెంట్‌యే కారణం అని ప్రజల మెదడుల్లోకి ఎక్కించాలని చూస్తున్నాయి. ఇది తీవ్రమైన ముప్పు. ఎలక్షన్ కమిషన్‌లో ఎవరున్నా, సీఈసీగా ఏ అధికారి కూర్చున్నా... క్షేత్రస్థాయిలో ప్రజలు ఓటు వేయకపోతే ఏ పార్టీ కూడా గెలవలేదు. ప్రజల్లో మద్దతు కోల్పోయినప్పుడు, తమ విధానాల్లోని లోపాలను సరిదిద్దుకోవడానికి బదులుగా రాజ్యాంగ వ్యవస్థలపై బురద జల్లడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజలకు ఉండే నమ్మకం సడలిపోతుంది. దేశంలో ఒకప్పుడు ఈవీఎంల వ్యవస్థను ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు కాలం చెల్లిన వాదనలను ముందుకు తెస్తూ మళ్లీ బ్యాలెట్ పేపర్ల విధానమే కావాలని తీర్మానించడం విడ్డూరంగా ఉంది. అంతేకాకుండా, ఎన్నికల ప్రక్రియకు ముందు పారదర్శకత కోసం చేపట్టే ఓటర్ జాబితా సవరణలను వ్యతిరేకించడం ద్వారా ఆ పార్టీ నిజస్వరూపం బయటపడుతోంది. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే సంస్కరణలను స్వాగతించాల్సింది పోయి, వాటిని అడ్డుకోవాలని చూడటం ఆ పార్టీ రాజకీయ అపరిపక్వతకు నిదర్శనం.ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు ఓటర్ జాబితాను ప్రక్షాళన చేస్తూ, దొంగ ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ప్రక్రియ. అసలు ఈ ఓటర్ జాబితా ప్రక్షాళన వల్ల ఎవరికి, ఎలాంటి నష్టం కలుగుతుందో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పటివరకు స్పష్టమైన వివరణ ఇవ్వలేకపోతున్నారు. ఒకవేళ జాబితాలో పొరపాట్లు జరిగి నిజమైన ఓటర్లు తమ హక్కును కోల్పోయి ఉంటే, బాధితులను నేరుగా ముందుకు తీసుకువచ్చి చట్టపరమైన పోరాటాలు చేయాలి లేదా ఆందోళనలు నిర్వహించాలి. కానీ క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య పనిచేయడం మానేసి, కేవలం ఢిల్లీ కేంద్రంగా ఏసీ గదుల్లో కూర్చుని ఈవీఎంలను, ఎన్నికల సంఘం నిర్ణయాలను గుడ్డిగా వ్యతిరేకించడమే అజెండాగా మార్చుకున్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఏ వ్యవస్థలైతే గొప్పవని ప్రచారం చేశారో, నేడు ప్రజలు అధికారం దూరం చేయగానే అవే వ్యవస్థలపై బురదజల్లడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారింది. ఈవీఎంల రూపకల్పనలో, వాటి దేశవ్యాప్త అమలులో ప్రధాన పాత్ర పోషించిన కాంగ్రెస్, ఇప్పుడు ఓట్లను కోల్పోతున్నామనే భయంతో మళ్లీ పాత రోజుల్లోకి తీసుకువెళ్లాలని ప్రయత్నిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకుంటూ ముందుకుపోవాల్సిన దేశాన్ని వెనక్కి లాగేలా ఇలాంటి ఉద్యమాలు చేయడం ఆ పార్టీ దిగజారిన రాజకీయ వ్యూహాలకు అద్దం పడుతోంది. ప్రజల తీర్పును గౌరవించడం నేర్చుకోకుండా, ప్రతి ఓటమికి ఈవీఎంలను బూచిగా చూపడం ప్రతిపక్షాలకు సాధారణమైపోయింది. సంస్కరణలను వ్యతిరేకించడం ద్వారా తాము చేస్తున్న తప్పులను కప్పిపుచ్చుకోవాలని చూస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. వ్యవస్థలపై నిరాధారమైన ఆరోపణలు మాని, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలపై పోరాడటం నేర్చుకుంటేనే ఆ పార్టీకి మనుగడ ఉంటుంది, లేదంటే ఈ గుడ్డి వ్యతిరేక రాజకీయాలు కాంగ్రెస్‌ను మరింత పాతాళానికి తొక్కడం ఖాయం.

పోరాటం వ్యవస్థల పరిరక్షణ కోసమే కావాలి!

ఈవీఎంలపై, ఎన్నికల సంఘం పారదర్శకతపై రోజూ చేసే ఆధారరహిత ఆరోపణలు పాలకపక్షాన్ని దెబ్బతీయడం ఏమో గానీ, సగటు ఓటరుకు ఓటింగ్ ప్రక్రియపైనే విరక్తి కలిగించేలా ఉన్నాయి. ఇది రాజ్యాంగ నిర్మాతలు ప్రసాదించిన ప్రజాస్వామ్య సౌధాన్ని పునాదుల నుంచి బలహీనం చేసే ద్రోహం కాదా?. గుర్తుంచుకోవాల్సిన ప్రధాన సూత్రం ఒకటే... ఏ వ్యవస్థ కూడా పరిపూర్ణం

శీతాకాలం ఉన్నట్టా..

తెలంగాణలో ఈ ఏడాది శీతాకాలం ఛాయలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది. సాధారణంగా నైరుతి రుతుపవనాల నిష్క్రమణతో వాతావరణంలో చలి పుంజుకోవాలి. కానీ, ఈ ఏడాది దానికి విరుద్ధంగా అక్టోబర్ ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రంలో శీతాకాలపు ఆనవాళ్లు లేకుండా పోవడానికి వాతావరణ మార్పులతో పాటు పాలకుల విధానపరమైన వైఫల్యాలే ప్రధాన కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.నైరుతి రుతుపవనాల ఉపసంహరణ సమయంలోనే ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆదిలాబాద్‌లో 37 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీలు, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఏడాది తెలంగాణలో నైరుతి రుతుపవనాల కాలంలో ఏకంగా 17 శాతం వర్షపాత లోటు నమోదైంది. మొత్తం 615.5 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా, అంతకంటే తక్కువగా వర్షాలు పడ్డాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో అయితే ఏకంగా 27 శాతం వర్షపాత లోటు నమోదు కావడం పట్టణాభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణను గాలికి వదిలేశారనేదానికి నిదర్శనం.ప్రకృతిలో వస్తున్న ఈ మార్పులపై పాలకులకు స్పష్టమైన ప్రణాళిక కొరవడింది. ఎల్ నినో పరిస్థితుల ప్రభావం ఉంటుందని భారత వాతావరణ శాఖ ముందే హెచ్చరించింది. కానీ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైంది. కర్బన ఉద్గారాలను తగ్గించడం, పట్టణాల్లో గ్రీనరీని పెంచడంపై కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్న రాజకీయ నాయకులు, గ్రౌండ్ లెవెల్‌లో కాలుష్య నియంత్రణకు కఠినమైన చట్టాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు.రుతుపవనాల నిష్క్రమణలో జాప్యం, వర్షపాత లోటు కారణంగా వాతావరణ సమతుల్యత దెబ్బతిన్నది. దీనివల్ల అక్టోబర్ నెలలోనే ప్రజలు తీవ్ర ఉక్కపోతతో, అసౌకర్య వాతావరణంతో అల్లాడిపోతున్నారు. శీతాకాలం జాడ లేకపోవడం వల్ల రాబోయే కాలంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి, వ్యవసాయ రంగానికి నష్టాలు తప్పవని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు ఓటు బ్యాంకు రాజకీయాలను పక్కన పెట్టి, వాతావరణ మార్పులను అరికట్టే దీర్ఘకాలిక విధానాలను అమలు చేయకపోతే.. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం తీవ్రమైన పర్యావరణ సంక్షోభాన్ని ఎదుర్కోక తప్పదు.

బ్యాలెట్ తో ఎన్నికలు

విజయవాడ,ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా కీలక ప్రకటన చేశారు. విజయవాడ వేదికగా పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఎన్నికల రోడ్‌మ్యాప్‌ను స్పష్టం చేశారు. ఈ దఫా స్థానిక సమరాన్ని బ్యాలెట్ పేపర్ల ద్వారానే నిర్వహించనున్నట్లు పునేఠా అధికారికంగా వెల్లడించారు. బ్యాలెట్ బాక్సుల లభ్యత, ముద్రణ, భద్రతా ఏర్పాట్లపై ఇప్పటికే క్షేత్రస్థాయి యంత్రాంగానికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశామని, ఎన్నికల నిర్వహణకు కమిషన్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని స్పష్టం చేశారు.ఓటర్ల జాబితా రూపకల్పనపై ఎస్ఈసీ ప్రకటన చేశారు. 2026 ఫిబ్రవరి నాటికి సిద్ధమయిన తుది ఓటర్ల జాబితానే ఈ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు పునేఠా ప్రకటించారు. అర్హులైన కొత్త ఓటర్లందరికీ ఓటు హక్కు కల్పించేలా, డూప్లికేట్ ఎంట్రీలు లేకుండా పకడ్బందీగా ఈ లిస్టులను రూపొందించాలని జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వార్డులు, పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాల పునర్విభజన ప్రక్రియను ఎటువంటి తప్పిదాలు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఉన్నతాధికార

14న సింహగర్జన

అదిలాబాద్, సింగరేణి కాలరీస్ కంపెనీలిమిటెడ్ మరోసారి చర్చనీయాంశంగా మారుతోంది. సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాడేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. సింగరేణి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫలమైందంటూ అక్టోబర్ 14న రామగుండం వేదికగా 'సింగరేణి కార్మిక గర్జన' నిర్వహించబోతోంది. ఈ సభకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కీలక నేత హరీశ్ రావు తదితరులు హాజరవుతున్నారు.సింగరేణి లాభాల్లో కార్మికులకు దక్కే వాటా గణనీయంగా తగ్గిపోయిందనేది బీఆర్ఎస్ ప్రధానంగా ఆరోపిస్తోంది. గత బీఆర్ఎస్ పాలనలో కార్మికులకు ఏకంగా 32 శాతం లాభాల వాటా అందిందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే ఆ వాటా 16 శాతానికి, ఆ తర్వాత 2024-25 నాటికి 12.5 శాతానికి పడిపోయిందని హరీష్ రావు ఆరోపించారు. దసరాకు ముందే లాభాలు, వాటాలను ప్రకటించడం ఆనవాయితీగా వస్తున్నప్పటికీ, ఈసారి ఆ సంప్రదాయానికి తూట్లు పడ్డాయని బీఆర్ఎస్ విమర్శిస్తోంది.సింగరేణి ఆర్థిక పరిస్థితిపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి రూ. 4,712 కోట్ల లాభాలను ఆర్జించగా, 2024-25 నాటికి అవి రూ. 6,394 కోట్లకు చేరాయని బీఆర్ఎస్ చెప్తోంది. అయితే ఈ ఏడాది మాత్రం లాభాలు రూ. 1,800 కోట్లకు మించే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలు, పరిపాలనా వైఫల్యాలు, టెండర్లలో జాప్యం, భారీ వ్యయంతో కూడిన కాంట్రాక్టుల కారణంగానే సంస్థ ఈ దుస్థితిని ఎదుర్కొంటోందని బీఆర్ఎస్ వాదిస్తోంది. మరోవైపు.. బ్యాంకుల్లో రూ.6,323 కోట్లు నిల్వ ఉన్నప్పటికీ, అదనంగా 4,000 కోట్ల ఓవర్‌డ్రాఫ్ట్ ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందని హరీష్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి బొగ్గు గనుల ప్రాంతాలు ఏ పార్టీ రాజకీయ భవిష్యత్తునైనా నిర్ణయించడంలో కీలక పాత్ర పోషించాయి. ఇప్పుడు సింగరేణి కార్మికులను కూడగట్టడం ద్వారా ఉత్తర తెలంగాణలో మళ్లీ పట్టు సాధించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. గతంలో తమ ప్రభుత్వ హయాంలో కార్మికులకు అందిన సంక్షేమం, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను పోల్చి చెప్పడం ద్వారా కార్మిక లోకంలో సానుభూతిని పొందడమే లక్ష్యంగా ఈ 'కార్మిక గర్జన' రూపుదిద్దుకుంటోంది.మొత్తానికి? రామగుండం వేదికగా జరగనున్న ఈ సభ రాష్ట్ర రాజకీయాల్లో అధికార కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టేందుకు బీఆర్ఎస్ చేస్తున్న వ్యూహాత్మక అడుగుగా పరిశీలకులు భావిస్తున్నారు. కార్మిక సమస్యల పేరుతో తెరపైకి వస్తున్న ఈ రాజకీయం రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో వేచి చూడాలి.

భూగర్భ విద్యుత్.. 6 వేల కి.మీ.కుపైగా అండర్‌గ్రౌండ్ కేబులింగ్

హైదరాబాద్, హైదరాబాద్‌లో విద్యుత్ మౌలిక వసతులను మరింత ఆధునికంగా, సురక్షితంగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రాజెక్ట్ చేపట్టింది. ఃఉ ఖాఖఆఅఒ ఆధ్వర్యంలో హైదరాబాద్ భూగర్భ విద్యుత్ కేబులింగ్ ప్రాజెక్ట్ ఫేజ్-1 అమలు కానుంది. ఇందులో సుమారు 311 కిలోమీటర్ల 33 కేవీ, 5,772 కిలోమీటర్ల 11 కేవీ విద్యుత్ లైన్లను భూగర్భంలోకి మార్చనున్నారు. చెట్లు, గాలులు, వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయాలు తగ్గడంతోపాటు వీధుల్లో భద్రత, నగర సౌందర్యం, స్మార్ట్ గ్రిడ్ సామర్థ్యం మెరుగుపడే అవకాశం ఉందని ఃఊఖఆఅఒ అధికారులు ట్విట్టర్ ఎక్స్ ద్వారా వెల్లడించారు.ప్రపంచ స్థాయి నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో విద్యుత్ మౌలిక వసతులను ఆధునీకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగరంలో ప్రస్తుతర్తంభాలపై ఉన్న విద్యుత్ లైన్లను దశలవారీగా భూగర్భంలోకి మార్చే హైదరాబాద్ భూగర్భ విద్యుత్ కేబులింగ్ ప్రాజెక్ట్ ఫేజ్-1ను చేపడుతోంది. తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్ట్ అమలు కానుండగా.. నగర విద్యుత్ వ్యవస్థలో గణనీయమైన మార్పులు వచ్చే అవకాశం ఉంది.ఫేజ్-1లో సుమారు 311 కిలోమీటర్ల మేర 33 కేవీ విద్యుత్ లైన్లను, దాదాపు 5,772 కిలోమీటర్ల మేర 11 కేవీ లైన్లను భూగర్భంలోకి తరలించనున్నారు. బంజారాహిల్స్, గ్రీన్‌ల్యాండ్స్, సైఫాబాద్, ప్యారడైజ్, కంటోన్మెంట్, మెహదీపట్నం, చార్మినార్, బేగంబజార్, బోయిన్‌పల్లి, అస్మాన్‌గఢ్, ఆజామాబాద్ డివిజన్లు ఈ తొలి దశలో భాగంగా ఉన్నాయి. బంజారాహిల్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్ సర్కిళ్ల పరిధిలోని 11 డివిజన్లలో ఈ పనులు చేపట్టనున్నారు. భూగర్భ కేబులింగ్‌తో ముఖ్యంగా వర్షాకాలంలో విద్యుత్ సరఫరాకు ఎదురయ్యే అంతరాయాలు తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం చెట్లు విరిగిపడటం, బలమైన గాలులు, వర్షాలు, పిడుగుల ప్రభావంతో విద్యుత్ లైన్లు దెబ్బతినే సందర్భాలు ఉంటాయి. కేబుళ్లు భూగర్భంలోకి వెళ్లడంతో ఇలాంటి బాహ్య ప్రభావాల నుంచి విద్యుత్ వ్యవస్థకు రక్షణ లభిస్తుంది. ఫలితంగా విద్యుత్ సరఫరాను మరింత స్థిరంగా కొనసాగించేందుకు వీలవుతుందని ఃఊఖఆఅఒ అధికారులు వెల్లడించారు.అదే సమయంలో రోడ్ల పక్కన, ఇళ్లకు సమీపంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు తగ్గడంతో ప్రజల భద్రత కూడా మెరుగుపడనుంది. బాల్కనీలు, ఇళ్లు, ఫుట్‌పాత్‌లకు సమీపంలో ఉన్న ప్రమాదకర విద్యుత్ లైన్ల సమస్య తగ్గడంతో పాటు స్తంభాల సంఖ్య తగ్గడం వల్ల పాదచారులకు మరింత స్థలం అందుబాటులోకి రానుంది. ముఖ్యంగా చారిత్రక ప్రాంతాలు, వారసత్వ కట్టడాల పరిసరాల్లో తీగల గందరగోళం తగ్గడం నగర సౌందర్యాన్ని పెంచే అంశంగా మారనుంది.ఈ ప్రాజెక్ట్‌లో స్మార్ట్ గ్రిడ్ సాంకేతికతకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఏఅంఆం ఆధారిత రింగ్ మెయిన్ యూనిట్లు అందుబాటులోకి రావడంతో విద్యుత్ నెట్‌వర్క్‌లో లోపాలను వేగంగా గుర్తించి, ప్రభావిత ప్రాంతాన్ని వేరు చేసి సరఫరాను త్వరగా పునరుద్ధరించే అవకాశం ఉంటుంది. భూగర్భ కేబుళ్లకు అనధికారికంగా కొక్కేలు వేయడం కష్టంగా ఉండటంతో విద్యుత్ చౌర్యం, సాంకేతిక నష్టాలను తగ్గించడంలోనూ ఈ వ్యవస్థ ఉపయోగపడనుంది. మొత్తంగా భూగర్భ కేబులింగ్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌ను మరింత సురక్షితమైన, అందమైన, ఆధునిక విద్యుత్ వ్యవస్థ కలిగిన నగరంగా తీర్చిదిద్దే దిశలో కీలక అడుగుగా నిలవనుంది. భవిష్యత్తులో నగరంలోని ఇతర ప్రాంతాలకు కూడా ఈ విధానాన్ని విస్తరించడం ద్వారా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మరింత పటిష్టమైన నెట్‌వర్క్‌ను నిర్మించే అవకాశం ఉంటుంది.

ఎమ్మెల్సీకే టోపీ..

హైదరాబాద్,ఏపీ ఎమ్మెల్సీ రామ చంద్రయ్య కే కేటుగాళ్లు టోకరా వేసారు. ఆయన దగ్గరే రూ.25 లక్షలు కాజేసారు. తమది కాని భూమి తమదేనని నమ్మించి మోసం చేసారు. మాదాపూర్ 100 ఫీట్ రోడ్డులో తనకు 5.5 ఎకరాల భూమి ఉందని, ఆ భూమిని అమ్ముతున్నామని జూబ్లీహిల్స్‌లో నివాసం ఉండే ఏపీ ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్యను పేరూరు తులసిగోపాల్, అతని కొడుకు గిరిధర్ అనే వ్యక్తులు. నమ్మించారు. వారి మాటలు నమ్మి రూ.25 లక్షలు అడ్వాన్సా రామచంద్రయ్య ఇచ్చారు.భూమి ఒరిజినల్ పత్రాలు చూపించాలని కోరగా తప్పించుకుని తిరగడంతో, అసలు ఆ భూమి తులసి గోపాల్ది కాదని తెలియడంతో ఎమ్మెల్సీ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ధనిక రాష్ట్రమా? లేక పెరుగుతున్న పేదరికమా..?



హైదరాబాద్, రాష్ట్రంలో సంక్షేమ రంగం వక్రదారి పడుతోంది. దారిద్ర్య రేఖకు దిగువనుండే కుటుంబాల సంఖ్య గణనీయంగా పెరిగిపోతోంది. వాస్తవ పరిస్థితులకు ఆమడ దూరంలో కనిపిస్తున్న లెక్కలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా ప్రజా ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియలో డొల్లతనం బహిర్గతమైంది. తెలంగాణాలో ఉన్న జనాభాకు, రేషన్ కార్డుల్లో లబ్ధి పొందుతున్న వారి సంఖ్యకు పెద్దగా తేడా కనిపించడం లేదు. ప్రజా పంపిణీ వ్యవస్థలో భారీగా అక్రమాలు జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. అందుకు అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచిన లెక్కలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలు.. అన్నీ కలిపి కుటుంబాల సంఖ్య కోటి 17 లక్షలు ఉండగా, రేషన్ కార్డుల సంఖ్య కోటి 6 లక్షలుగా ఉన్నట్లు లెక్కలున్నాయి.తాజా సర్వేల ప్రకారం.. తెలంగాణాలో 3.55 కోట్ల జనాభా ఉండగా, అందులో 3.43 కోట్ల మంది పేదలే ఉన్నట్లు రేషన్ కార్డుల లబ్ధిదారుల సంఖ్యను బట్టి స్పష్టమవుతోంది. అంటే, రాష్ట్రంలో కేవలం 11 లక్షల మంది మాత్రమే రేషన్ కార్డులు లేకుండా ఉన్నారు. అనధికార అంచనాల ప్రకారం.. సరాసరిగా 15 లక్షల నుంచి 20 లక్షల మంది టాక్స్ పేయర్లున్నారు. దాదాపు 10 లక్షలకు పైగా భూస్వాములు, అగ్రశ్రేణి, ధనిక వర్గాలకు చెందిన వారున్నట్లు సామాజిక సర్వేలు స్పష్టం చేస్తున్నాయి.కానీ, రేషన్ కార్డుల జారీ ప్రక్రియలో ప్రభుత్వం చెబుతున్న లెక్కలు మాత్రం అనేక అనుమానాలకు, అపోహలకు దారితీస్తున్నాయి. ఈ క్రమంలో అసలు తెలంగాణ ధనిక రాష్ట్రమా? లేక పేదరికంలో మగ్గుతున్న రాష్ట్రమా? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.రాష్ట్రమంతా 95శాతానికి పైగా పేదరికాన్ని చూపుతున్న అధికారిక లెక్కలు ఆందోళన కగిలిస్తున్నాయి. గతంలోనూ, ఇప్పుడూ అనేక సందర్భాల్లో ప్రభుత్వ ప్రకటనల్లో సంపన్న రాష్ట్రంగా నేతలు కితాబిచ్చిన విషయం తెలిసిందే. వాస్తవాలను పరిశీలిస్తే, రాజకీయ లబ్ధి కోసం ఇష్టారాజ్యంగా రేషన్ కార్డులు పంపిణీ చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వంగా అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాల్లో రేషన్ కార్డునే ప్రధాన కొలమానంగా పరిగణిస్తారు. పేదలకు కార్పొరేటు వైద్యం అందించే రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలోనూ రేషన్ కార్డు మాత్రమే ప్రామాణికం. బీసీ, ఎస్సీ, ఎస్టీ.. ఇలా ఏ సామాజికవర్గానికి చెందిన వారైనా ఆయా సంక్షేమ శాఖల నుంచి విడుదలయ్యే రాయితీలు, సబ్సిడీలు, ప్రోత్సాహక నిధులు, స్కాలర్‌షిప్‌లు, భోదనా ఫీజులు ఇలా ప్రభుత్వ పరంగా అనేక కోణాల్లో ఆర్థిక వెసులుబాటు కలుగుతోంది. విదేశాలకు వెళ్లాలన్నా, ఉన్నత చదువులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ రావాలన్నా రేషన్‌కార్డు ఉంటే చాలు. ఆ వర్గాలకు రెవెన్యూ ఇతర శాఖల నుంచి అల్పాదాయ ధృవీకరణ పత్రాలు కూడా మంజూరు చేస్తారు. దీంతో పెద్దమొత్తంలో ప్రజాధనం అనర్హులకు అందుతోందన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ పరిణామాలు కేవలం సంక్షేమ రంగంపైనే కాదు.. మిగతా అన్ని రంగాలపైనా తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. అనర్హులకు సంక్షేమ ఫలాలు అందుతుండడంతో రాష్ట్ర ఖజానాపై మోయలేని భారం పడుతోంది.వాస్తవికతకు ఆమడ దూరంలో లెక్కలపై తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంక్షేమం పేరుతో దగా జరగుతోందని, రేషన్ బియ్యం వక్రదారి పడుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవసరానికి మించి పెరిగిపోయిన కార్డుల సంఖ్యతో పేదరికం కనిపిస్తోంది కానీ, దాని వెనక రాజకీయ కోణం, నేతల భవిష్యత్తు వ్యూహం దాగి ఉందన్న విషయం కూడా స్పష్టమవుతోంది. లబ్ధిదారుల్లో సరిసరిగా 25శాతానికి పైగా అనర్హులుండే అవకాశం ఉంది. వాస్తవ పరిస్థితులకు, అధికారిక లెక్కలకు పొంతన లేకుండా పోతోన్న సందర్భంలో ప్రభుత్వం స్పందించాలని, అర్హులకు మాత్రమే ప్రజాధనం ఖర్చయ్యేలా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉందని సామాజిక విశ్లేషకులు, ఆర్థికరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రేషన్ కార్డులు చెబుతున్న నిజం ఆధారంగా తక్షణ చర్యలకు పూనుకోవాలన్న డిమాండ్ వస్తోంది. తెలంగాణ ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో జనాభా 3 కోట్ల 55 లక్షలు ఉంటే, రేషన్ పొందే జనాభా 3.43 కోట్లు-గా ఉంది. అయితే, తెలంగాణ రిచ్ స్టేట్ ఎలా ఉవుతుందన్న ప్రశ్నకు సమాధానం లేకుండా పోతోంది. సర్కారు డేటా చెబుతున్నది నిజమా? పాలకులు చెబుతున్నది నిజమా? అన్న అంశంపై సమాజంలో స్పష్టత కనిపించడం లేదు. రేషన్ కార్డ్ పేదల కోసమా? లేక ఓట్లు- రాబట్టడం కోసమా? అని సామాజికవేత్తలు నిలదీస్తున్నారు.అధిక ఆదాయవర్గాలకు చెందిన వారు, వ్యాపార, వాణిజ్యవేత్తలు, పారిశ్రామికవేత్తలు, వార్షిక ఆదాయంపై ఇన్‌కమ్ ట్యాక్స్ (ఐటీ) కట్టే వారి చేతిలోనూ రేషన్ కార్డులున్నట్లు ప్రభుత్వ లెక్కల్లోనే స్పష్టమవుతుడడం పట్ల తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్థికంగా, రాజకీయంగా బలమైన వ్యాపారస్తుల చేతిలో తెల్ల కార్డులుండడమేమిటన్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పలేకపోతున్నారు.

ప్రధాని మోదీ ప్రెస్ కాన్ఫరెన్స్‌లకు ఎందుకు దూరం?

న్యూఢిల్లీ,గుజరాత్ సీఎంగా, ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ సుదీర్ఘకాలంగా పదవిలో కొనసాగుతున్నారు. పరిపాలకుడిగా పాతికేళ్లు పూర్తి చేసుకున్నారు. బీజేపీ నాయకులు దేశవ్యాప్తంగా సంబరాలు చేసుకుంటున్నారు. మంచిదే. ప్రధానమంత్రిగా వరుసగా మూడు సార్లు ఎన్నికల్లో విజయం సాధించారు. అయితే ఇంత సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఆయన దేశీయ మీడియాతో నేరుగా ప్రశ్నలు--సమాధానాల రూపంలో నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లు చాలా పరిమితంగా ఉన్నాయనే చర్చ చాలాకాలంగా ఉంది. 2019 మే 17న బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మోదీ, అమిత్ షా కలిసి పాల్గొన్నారు. అయితే జర్నలిస్టుల ప్రశ్నలకు ప్రధానంగా అమిత్ షానే సమాధానాలు ఇచ్చారు. అదే సమయంలో విదేశీ పర్యటనల్లో ఇతర దేశాధినేతలతో కలిసి మీడియా సమావేశాల్లో మోదీ పాల్గొన్న సందర్భాలు ఉన్నాయి. కొన్ని భారతీయ మీడియా సంస్థలకు ముఖాముఖి ఇంటర్వ్యూలు కూడా ఇచ్చారు.దేశంలో NEET పరీక్ష, భద్రతా సమస్యలు, వివిధ ఉద్యమాలు, ఎన్నికల ప్రక్రియపై వచ్చిన రాజకీయ విమర్శలు వంటి అనేక అంశాలపై ప్రజల్లో ప్రశ్నలు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఇలాంటి సమయంలో ప్రధాని స్వయంగా మీడియా ముందుకు వచ్చి జర్నలిస్టుల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తే ప్రభుత్వ వైఖరిని ప్రజలకు మరింత స్పష్టంగా వివరించే అవకాశం ఉంటుంది. ఇక్కడ మరో పోలిక కూడా తరచూ చర్చకు వస్తుంది.మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తన పదవీకాలంలో అనేక ప్రెస్ కాన్ఫరెన్స్‌లలో పాల్గొని జర్నలిస్టుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఆయనపై అప్పట్లో బీజేపీ నుంచి తీవ్ర విమర్శలు వచ్చిన విషయం కూడా తెలిసిందే. అందుకే ఇప్పుడు ఒక ప్రశ్న సహజంగానే వస్తోంది. జర్నలిస్టులు దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటారు. ఆ ప్రశ్నలను ప్రభుత్వ పెద్దల ముందుకు తీసుకెళ్లి సమాధానాలు పొందడం మీడియా బాధ్యత.అదే సమయంలో ప్రభుత్వం తన విధానాలను ప్రజలకు వివరించడానికి కూడా ఇది ఒక ముఖ్యమైన వేదిక. అయితే ప్రధాని మోదీ మీడియాతో ఇంటర్వ్యూలు ఇస్తున్నప్పటికీ, ఓపెన్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లకు మాత్రం ఎందుకు పరిమితంగా ఉంటున్నారు? దీనిపై ప్రధాని కార్యాలయం నుంచి స్పష్టమైన కారణం ఏమిటన్నది కూడా ప్రజలకు తెలుసుకోవాల్సిన అంశమే. ఇది మోదీని విమర్శించడం కోసం అడుగుతున్న ప్రశ్న కాదు.దేశ ప్రధానమంత్రి మీడియా ప్రశ్నలకు నేరుగా సమాధానం చెప్పే సంప్రదాయం మరింత బలపడాలా? అన్నదే అసలు చర్చ. ప్రజలకు నాయకత్వానికి, ప్రభుత్వానికి మధ్య వారధిగా మీడియా పనిచేస్తుంది. అలాంటప్పుడు జర్నలిస్టుల ప్రశ్నలను నేరుగా ఎదుర్కొనే మరిన్ని అవకాశాలు ఉంటే ప్రజాస్వామ్య వ్యవస్థకు మరింత ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి.మోదీ మీడియాను చూసి భయపడుతున్నారని కొందరు విమర్శిస్తుంటారు. అయితే "మోదీ మీడియాను చూసి భయపడుతున్నారు" అని ఖచ్చితంగా చెప్పడానికి ఆధారం లేదు. కానీ ప్రశ్నలు అడగడానికి స్వేచ్ఛ ఉన్న ఓపెన్ ప్రెస్ మీట్‌లకు ఆయన దూరంగా ఉండటం మాత్రం స్పష్టమైన రాజకీయ-మీడియా వ్యూహంగా కనిపిస్తుంది.



అసలు పరిస్థితి ఏమిటి?

నరేంద్ర మోదీ 2014లో ప్రధానమంత్రి అయిన తర్వాత, సాధారణంగా ప్రధానమంత్రులు నిర్వహించే తరహాలో తరచుగా ఓపెన్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించలేదు. 2019 ఎన్నికల సమయంలో ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. అయితే జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు ప్రధానంగా అప్పటి దీఙీూ అధ్యక్షుడు అమిత్ షా సమాధానాలు ఇచ్చారు. మోదీ స్వయంగా ప్రశ్నలను తీసుకోలేదు.అయితే దీనర్థం ఆయన మీడియాతో మాట్లాడరని కాదు. ఆయన టీవీ ఇంటర్వ్యూలు ఇస్తారు, ఎన్నికల సమయంలో ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇస్తారు, ప్రసంగాలు చేస్తారు, సోషల్ మీడియా ద్వారా నేరుగా ప్రజలను చేరుకుంటారు. 2024లో India Todayకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయంపై మోదీ స్వయంగా వివరణ ఇచ్చారు.

మోదీ చెప్పే కారణం ఏమిటి?

2024లో "మీరు ప్రెస్ మీట్‌లు ఎందుకు నిర్వహించరు?" అని అడిగినప్పుడు, మోదీ ప్రధానంగా మీడియా స్వభావం మారిపోయిందని చెప్పారు.ఆయన వాదన ప్రకారం: గతంలో ప్రజలను చేరుకోవడానికి మీడియా ప్రధాన మార్గం. ఇప్పుడు సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, ఇతర ప్రత్యక్ష కమ్యూనికేషన్ మార్గాలు ఉన్నాయి. టీవీ యాంకర్లు కూడా తమ అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేస్తున్నారు కాబట్టి, మీడియా గతంలో ఉన్న "తటస్థ మధ్యవర్తి" పాత్రలో లేదని ఆయన భావిస్తున్నారు. అందువల్ల తాను ప్రజలతో నేరుగా మాట్లాడటానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నానని చెప్పారు.అంటే "నాకు మీడియా అంటే భయం" అనేది ఆయన చెప్పిన కారణం కాదు.

మరి విమర్శకులు ఎందుకు "భయపడుతున్నారు" అంటున్నారు?

ఇక్కడ అసలు ప్రజాస్వామ్య ప్రశ్న ఉంది. ముందుగా నిర్ణయించిన ఇంటర్వ్యూలో అడిగే ప్రశ్నలు, ప్రధానమంత్రి ప్రసంగం, సోషల్ మీడియా పోస్ట్---ఇవన్నీ నియంత్రిత కమ్యూనికేషన్ కిందకు వస్తాయి. కానీ ఓపెన్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో జర్నలిస్ట్ ప్రశ్న ఏమిటో ముందుగా తెలియదు ? సమాధానం వెంటనే ఇవ్వాలి ? అనుబంధ ప్రశ్న కూడా రావచ్చు.అందుకే విమర్శకులు చెబుతున్నది "మోదీ ప్రశ్నలకు సమాధానం చెప్పలేరు" అని నిరూపించబడిందని కాదు. "అలాంటి పరీక్షకు ఆయన తరచుగా తనను తాను ఎందుకు గురిచేయరు?" అనేదే.ప్రెస్ ఫ్రీడమ్‌పై పనిచేసే సంస్థలు కూడా ఓపెన్, అన్‌స్క్రిప్టెడ్ ప్రశ్నలు ప్రజాస్వామ్య జవాబుదారీతనానికి ముఖ్యమైనవని పేర్కొంటున్నాయి.

అయితే "భయపడుతున్నారు" అని తేల్చేయడం సరైనదా?

లేదు. ఎందుకంటే ఒక నాయకుడు ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించకపోవడానికి అనేక వ్యూహాత్మక కారణాలు ఉండవచ్చు.

మెసేజ్‌ను నియంత్రించుకోవడం - తాను చెప్పాలనుకున్న అంశంపైనే దృష్టి పెట్టవచ్చు.

ప్రత్యక్ష ప్రజా కమ్యూనికేషన్ - సోషల్ మీడియా, ప్రసంగాలు, Mann Ki Baat వంటి మార్గాలు మధ్యవర్తి అవసరాన్ని తగ్గిస్తాయి.

రాజకీయ రిస్క్ తగ్గించడం - అనుకోని ప్రశ్న లేదా ఫాలో-అప్ ప్రశ్న పెద్ద రాజకీయ వివాదంగా మారే అవకాశం ఉండదు.

మీడియాపై ఆయనకున్న అభిప్రాయం - 2024లో మోదీ స్వయంగా ప్రస్తుత మీడియా గతంతో పోలిస్తే భిన్నంగా ఉందని చెప్పారు.

అందువల్ల "భయం"ఒక రాజకీయ విమర్శ. నిరూపితమైన వాస్తవం కాదు. కానీ మరో ముఖ్యమైన కోణం ఉంది. ఇక్కడ మోదీపై విమర్శ చాలా బలమైన ప్రజాస్వామ్య వాదనను కలిగి ఉంది. ప్రధానమంత్రి దేశంలో అత్యంత శక్తివంతమైన ఎన్నికైన పదవుల్లో ఒకటి. పార్లమెంటు, కోర్టులు, ఎన్నికలు మాత్రమే కాకుండా స్వేచ్ఛా మీడియా కూడా అధికారాన్ని ప్రశ్నించే వ్యవస్థలో భాగం.కాబట్టి ప్రధానమంత్రి ఒకసారి, రెండుసార్లు కాదు-సంవత్సరాలపాటు ఓపెన్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లకు దూరంగా ఉంటే, "ప్రజలకు, మీడియాకు, ప్రతిపక్షానికి నేరుగా ప్రశ్నించే అవకాశం ఎందుకు ఇవ్వడం లేదు?" అని అడగడం పూర్తిగా సమంజసం. అదే సమయంలో, భారత మీడియా వాతావరణంలో ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఒత్తిళ్లపై కూడా రిపోర్టులు ఉన్నాయి. Reuters Institute 2024లో విదేశీ జర్నలిస్టుల వీసాలు, అనుమతులు, అధికారుల ఒత్తిళ్లకు సంబంధించిన పలు ఉదాహరణలను నమోదు చేసింది."మోదీ మీడియాకు భయపడుతున్నారు" - దీనికి నిర్ధారిత ఆధారం లేదు. కానీ "మోదీ ఓపెన్, అన్‌స్క్రిప్టెడ్ మీడియా ప్రశ్నలను ఎదుర్కొనే వ్యవస్థను చాలా పరిమితంగా ఉంచుతున్నారు" - ఇది వాస్తవంగా గమనించగల విషయం. ఈ రెండింటి మధ్య చాలా తేడా ఉంది.నిజానికి ఆయనకు భయం ఉందో లేదో తెలుసుకోవడానికి ఒకే సరళమైన పరీక్ష ఉంది. ప్రతి సంవత్సరం ఒకటి లేదా రెండు పూర్తి స్థాయి ఓపెన్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించి, జర్నలిస్టులు ముందస్తు అనుమతి లేకుండా ప్రశ్నలు అడిగే అవకాశం ఇవ్వడం. అప్పుడు "మోదీ ప్రశ్నలను తట్టుకోలేరు" అనే విమర్శకు స్వయంగా సమాధానం లభిస్తుంది.

ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ అనవసర రాద్ధాంతం..

హైదరాబాద్,ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో కాంగ్రెస్ పార్టీ అనవసర రాద్ధాంతం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బీజేపీకి పెరుగుతున్న ప్రజాదరణను కాంగ్రెస్ పార్టీ ఓర్వలేకపోతోందని, ఓటమి భయంతోనే వివిధ అంశాలపై ఆందోళనలు చేస్తోందని ఆరోపించారు.ఓటర్ల జాబితాలో ఉన్న అవకతవకలను సరిచేయడం, డూప్లికేట్ ఓట్లు, అనర్హమైన ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యానికి అవసరమని కీర్తిరెడ్డి పేర్కొన్నారు. గతంలో ఓటర్ల జాబితాలో అక్రమాలున్నాయని ఆరోపించిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు వాటిని సరిచేసే ప్రక్రియను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. నిజమైన ఓటర్ల హక్కులను కాపాడటమే ఏఐఖీ లక్ష్యమని, అర్హులైన ఓటర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తొలగించబడిన ఓట్ల విషయంలో అభ్యంతరాలుంటే సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించాలే తప్ప, రోడ్లపై ఆందోళనలు చేయడం సరికాదని హితవు పలికారు.ఓట్ చోరీ గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని కీర్తిరెడ్డి విమర్శించారు. గతంలో జరిగిన రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ.. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ఈ అంశాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.మరోవైపు, తెలంగాణలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రజా సమస్యలను పరిష్కరించకుండా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో ధ

రియాద్ ఎయిర్‌పోర్ట్‌పై దాడి.. 12 మంది మృతి



రియాద్: సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన భీకర దాడిలో 12 మంది ప్రాణాలు కోల్పోగా, 309 మంది తీవ్రంగా గాయపడ్డారు. యెమెన్‌కు చెందిన హౌతీ రెబల్స్ ఈ దాడికి పాల్పడినట్లు సౌదీ నేతృత్వంలోని సైనిక కూటమి తీవ్రంగా ఆరోపించింది. ఈ ఊహించని పరిణామానికి విమానాశ్రయంలోని అన్ని కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేశారు.

మృతులు, క్షతగాత్రుల వివరాలు మరియు సహాయక చర్యలు

సౌదీ పౌర విమానయాన అథారిటీ వెల్లడించిన వివరాల ప్రకారం, మృతుల్లో నలుగురు సౌదీ పౌరులు, ఇద్దరు బంగ్లాదేశీయులు ఉన్నారు. వీరితో పాటు అమెరికా, జోర్డాన్, పాలస్తీనా, సిరియా, సూడాన్, ఈజిప్టు దేశాలకు చెందిన ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. దాడి జరిగిన వెంటనే డజనుకు పైగా అంబులెన్సులు హుటాహుటిన విమానాశ్రయానికి చేరుకున్నాయి. టెర్మినల్‌లోని గేట్ 401 వద్ద దాడి జరిగిందని, ప్రయాణికులు భయంతో పరుగులు తీశారని ప్రత్యక్ష సాక్షులు వివరించారు.

యుద్ధ నేరంగా అభివర్ణించిన సౌదీ కూటమి -- విమాన సర్వీసులు రద్దు

ఈ దాడిని సౌదీ సైనిక కూటమి 'పూర్తిస్థాయి యుద్ధ నేరం'గా అభివర్ణించింది. ప్రయాణికులు, విమానాశ్రయ సిబ్బందిని లక్ష్యంగా చేసుకున్నారని, దీనికి తగిన రీతిలో స్పందించి ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించారు. ఈ దాడిలో ఒక అమెరికా పౌరుడు మరణించినట్లు యూఎస్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబియో ధ్రువీకరించారు. సౌదీపై జరుగుతున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ పరిణామాల నేపథ్యంలో కువైట్ ఎయిర్‌వేస్ సహా పలు గల్ఫ్ విమానయాన సంస్థలు రియాద్‌కు తమ సర్వీసులను పూర్తిగా రద్దు చేశాయి.

ఉద్ధృతమవుతున్న యెమెన్ ఘర్షణలు

గత కొన్ని రోజులుగా సౌదీ అరేబియాలోని విమానాశ్రయాలపై హౌతీల దాడులు క్రమంగా పెరిగాయి. శనివారం దమ్మామ్‌లోని కింగ్ ఫహద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో కూడా ఒక ప్రొజెక్టైల్ పడింది. అక్టోబర్ 6, 7 తేదీల్లో జరిగిన దాడుల్లో ముగ్గురు మరణించారు. యెమెన్ అంతర్యుద్ధంలో సౌదీ అరేబియా జోక్యం చేసుకోవడం వల్లే తాము దాడులు చేస్తున్నామని హౌతీలు ప్రకటిస్తున్నారు. 2022లో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం విఫలం కావడంతో యెమెన్‌లో మళ్లీ ఘర్షణలు తీవ్రమయ్యాయి. దీంతో సౌదీపై హౌతీలు క్షిపణి, డ్రోన్ దాడులను మరింత ఉద్ధృతం చేశారు.

జెన్ జీ తో మోడీ అండ్ రాహుల్...మా మాట వినండి !



న్యూఢిల్లీ,జెన్ జీ ఇపుడు దేశ రాజకీయాల్లో కీలకమైన ఫ్యాక్టర్ గా మారుతోంది. జెన్ జీ యూత్ ఏమైనా చేయగలరు అన్నది కూడా అందరికీ అర్థం అవుతోంది. వారు తలచుకుంటే రాత్రికి రాత్రి ఉద్యమాలు పుట్టించగలరు, ఎందాకైనా అని దూసుకుని పోగలరు,వారిని సునామీగా అభివర్ణించవచ్చేమో.అలాగే వారు దూకుడుకు హద్దే లేదు అని అంటారు. ఇక రేపటి ఎన్నికల్లో వారి ప్రభావం అపారం. అందుకే దేశ రాజకీయాలు మొత్తం జెన్ జీ చుట్టే తిరుగుతున్నాయి. ఇక చూస్తే జెన్ జీతో తరచూ ఇంటరాక్ట్ అవుతున్నారు ప్రధాని నరేంద్ర మోడీ అలాగే కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ. చిత్రమేంటి అంటే చెన్నై వేదికగా కేవలం ఒక్క రోజు తేడాలో రాహుల్ మోడీ ఇద్దరూ జెన్ జీతో మీటింగులు పెట్టడం.

యువత సత్తా అది :

ఈ దేశాన్ని ప్రపంచాన్నే మార్చగల సత్తా యువతకు ఉందని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. తమిళనాడు పర్యటనలో భాగంగా ఆయన చెన్నైలోని నందంబాక్కంలో చెన్నై ట్రేడ్ సెంటర్‌లో జైగోపాల్ గరోడియా హిందూ విద్యాలయ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ స్కూల్ స్వర్ణోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశమే కాదు ప్రపంచం ఈ రోజున ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే సామర్థ్యం యువత సొంతం అన్నారు. యువత తమ భవిష్యత్తు కోసం విశాలంగా ఆలోచించాలని మోడీ ఉద్బోధించారు. పెద్ద కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అని మోడీ పిలుపు ఇచ్చారు.

భారత్ వికాసం కోసం :

అభివృద్ధి చెందిన భారతం కోసం యువత అవసరమైన కొత్త ఆలోచనలు సూచనలు, అలాగే పరిష్కారాలు అందించాలని మోడీ కోరారు. ఈ రోజున భారత్‌లో యువతకు ఉన్నన్ని అవకాశాలు ఎక్కడా లేవని ఆయన చెప్పారు. యువత తాము అనుకున్నది చేయాలని, అదే సమయంలో నిర్మాణాత్మక పంథాను వీడరాదని మోడీ చెప్పారు. ఎలాంటి యువత భయం లేకుండా ముందుకు సాగాలని మోడీ పిలుపునిచ్చారు. ఇదిలా ఉంటే ఢిల్లీలో సర్ కి వ్యతిరేకంగా జెన్ జీలు సీజేపీ నాయకత్వంలో ఉద్యమిస్తున్నారు. అదే సమయంలో యువత శక్తిని నరేంద్ర మోడీ గుర్తు చేస్తూనే దేశాభివృద్ధికి పాటు పడాలని సూచించడం విశేషం.

రాహుల్ స్పీచ్ అయితే :


మరో వైపు చెన్నైలో ఐలాండ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఛాత్రోన్ కీ గూంజ్ ఆరవ ఎడిషన్ కార్యక్రమాన్ని రాహుల్ యువతతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడాలని పిలుపు ఇచ్చారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దేశ రాజ్యాంగంపై దాడి చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి దేశ ప్రజల గళాన్ని వినిపించడానికి యువత తమ నిరసనలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఆపకూడదని ఆయన కోరారు. యువత నిరంతరాయంగా పోరాడుతూనే ఉండాలని ఆయన కోరారు. అదే సమయంలో రాజ్యాంగంపై దాడికి దిగుతున్న శక్తులను తాము ఖచ్చితంగా ఓడిస్తామని రాహుల్ ధీమా వ్యక్తం చేశారు.

యువత సమస్యల గురించి :

ఇదిలా ఉంటే ఈ సదస్సులో రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా అలాగే తమిళనాడు విద్యార్థులు ఎదుర్కొంటున్న నీట్ పరీక్ష సమస్యలు పేపర్ లీకేజీలు, దేశంలో తీవ్రమైన నిరుద్యోగం, విద్యా రంగంలో ఎదురవుతున్న ఆర్థిక భారాలు మహిళా

విజయ నగరంలో వైసీపీకి వరస దెబ్బలు

విజయనగరం, విజయనగరం జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వరుసగా కీలక నేతలను కోల్పోతూ భారీ షాక్‌లను ఎదుర్కొంటోంది. ఇటీవలే పార్టీ సీనియర్ నేత, బొత్స సత్యనారాయణ బంధువు అయిన మజ్జి శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేయగా, ఆయన వెంటే పలువురు జడ్పీటీసీలు కూడా పార్టీని వీడారు.ఆ దెబ్బ నుంచి కోలుకోకముందే పార్టీకి చెందిన మరికొందరు ముఖ్య నేతలు వరుసగా రాజీనామాలు చేస్తుండటంతో జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఖాళీ అవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే, విజయనగరం జడ్పీ మాజీ చైర్మన్ బడ్డుకొండ అప్పలనాయుడు వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేశారు. పార్టీ అధిష్ఠానం ఆయనను సస్పెండ్ చేసిన కొన్ని గంటల్లోనే ఆయన తన రాజీనామాను ప్రకటించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఒక నియంతలా వ్యవహరిస్తున్నారని, పార్టీని ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలా మార్చేశారని ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. మరొకవైపు కోలగట్ల వీరభద్రస్వామి కూడా పార్టీ మారతారని వినిపించినా ఆయన ఆ ప్రచారాన్ని కొట్టిపారేశారు. తాను కొంత కాలం నుంచి విశాఖలో ఉన్నంత మాత్రాన పార్టీని వీడుతారన్న ప్రచారం సరైనది కాదని ఆయన కొట్టిపారేశారు. తనకు ఇప్పుడు అరవై ఐదేళ్లని, తాను ఇప్పుడు పార్టీ మారి ఏం చేస్తానని ఆయన నవ్వుతూ అనడం కూడా చర్చనీయాంశమైంది. అయితే గతంలో అధికారంలో ఉన్నప్పుడు తన కుమార్తెను మేయర్ పదవికి పోటీ చేయాలని ప్రయత్నించి, ఇప్పుడు ఓటమి చెందిన తర్వాత తాము కొత్తవారికి అకాశం ఇవ్వాలని కోలగట్ల అనడం చర్చనీయాంశమైంది. కోలగట్ల వీరభద్రస్వామి నిజానికి పార్టీని వీడకపోవచ్చు. ఆయన వైసీపీలో ఉండే అవకాశాలు ఉండి ఉండవచ్చు. కానీ ఆయన సమావేశంలో మాట్లాడిన తీరు మాత్రం వైసీపీ నేతలు ఎవరైనా వెళితే సాధారణమేనని కొట్టిపారేయడం కూడా ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. బెల్లం ఉన్న చోటకే ఈగలు ముసురుతాయని, గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నుంచి అనేక మంది నేతలు తమ పార్టీలోకి వచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ అన్న మాటలు తాను ఎవరు పార్టీని వదిలి వెళ్లినా పట్టించుకోనని మాత్రమే చెప్పినట్లయింది. .. కేవలం విజయనగరం ప్రాంతంలోనే కాదు. బొబ్బిలి, గజపతినగరం నియోజకవర్గాల్లో భారీ చేరికలు టీడీపీ, జనసేనలో ఉంటాయన్న ప్రచారం నడుస్తుంది. అక్టోబర్ మొదటి వారంలో బొబ్బిలి, గజపతినగరం నియోజకవర్గాలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, స్థానిక నాయకులు పార్టీకి గుడ్ బై చెప్పారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కళా వెంకటరావు సమక్షంలో పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ లో చేరారు.జిల్లాలోని పలు మండలాల్లో ఒకేరోజు వందలాది కుటుంబాలు వైఎస్సార్‌సీపీకి దూరమై కూటమి



పార్టీల వైపు మొగ్గు చూపుతుండటంతో విజయనగరంలో వైఎస్సార్‌సీపీ మరింత బలహీనపడుతోంది. ఇక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎక్కువ మంది ద్వితీయ శ్రేణి నేతలు వైసీపీకి దూరమవుతారన్న ప్రచారం జరుగుతోంది. బొత్స సత్యనారాయణవంటి సీనియర్ నేతలున్న ఈ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి నేతలు దూరమవుతుండటంతో కొంత ఇబ్బందికరమైన పరిణామమే. అయితే నేతలు వెళ్లినంత మాత్రాన ఓటు బ్యాంకు మాత్రం చెక్కు చెదరదన్న ధీమాలో వైసీపీ నేతలున్నారు. మరి ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయన్నది చూడాలి.

బెజవాడకు దళపతి విజయ్...

విజయవాడ, తమిళనాడు సీఎం ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. విజయవాడలో అత్యంత వైభవంగా జరిగే ప్రసిద్ధ ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలకు హాజరుకావాల్సిందిగా విజయ్‌ను విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్ ప్రత్యేక బృందం నేరుగా ఆహ్వానించింది. ఎంపీ బృందం ఆహ్వానానికి విజయ్ కూడా సానుకూలంగా స్పందించినట్లు, దసరా వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.ఇటీవల కాలంలో విజయ్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై, ఇక్కడి సామాజిక పరిస్థితులపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నట్లు ఆయన వ్యూహకర్తలు చెబుతున్నారు. తన పార్టీ భావజాలాన్ని, తమిళనాడు ప్రభుత్వ విజయాలను కేవలం సొంత రాష్ట్రానికే పరిమితం చేయకుండా తెలుగు ప్రజలకు కూడా చేరేలా ప్రత్యేకంగా తెలుగులో ప్రకటనలు ఇప్పించడం, టీవీ ఛానెళ్లలో ప్రసారం చేయించడం చేస్తున్నారు. కేవలం సినిమాల ద్వారానే కాకుండా, రాజకీయంగా కూడా తన ప్రభావాన్ని ఇతర రాష్ట్రాలకు, ముఖ్యంగా పొరుగునే ఉన్న ఏపీకి విస్తరించాలనే ఆలోచనలో విజయ్ ఉన్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు అంటున్నాయి.

దీదీ.. కాంగ్రెస్‌లో విలీనమే ఏకైక మార్గమా?



బెంగాల్: బెంగాల్ రాజకీయాల్లో దశాబ్దాల పాటు ఎదురులేని శక్తిగా చక్రం తిప్పిన దీదీ మమతా బెనర్జీ నేడు తన రాజకీయ జీవితంలోనే అత్యంత దయనీయమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. వామపక్షాల మూడు దశాబ్దాల కంచుకోటను బద్దలుకొట్టి తృణమూల్ కాంగ్రెస్ ని అధికారంలోకి తెచ్చిన నాటి దూకుడు, ఆమె సొంత పార్టీలోనే నిట్టనిలువునా చీలిక రావడంతో ఒక్కసారిగా ఆవిరైపోయింది. తిరుగుబాటు వర్గం మెజారిటీ ఎంపీలు, ఎమ్మెల్యేలను తమవైపు తిప్పుకుని అసెంబ్లీలో ప్రతిపక్ష హోదాను దక్కించుకోవడమే కాకుండా, పార్టీ అసలు పేరు, చిహ్నంపై కేంద్ర ఎన్నికల సంఘం వద్ద పైచేయి సాధించే దిశగా పావులు కదుపుతోంది. మెజారిటీ ప్రజాప్రతినిధులు రెబెల్ క్యాంప్ వైపు మొగ్గు చూపడంతో, మమత తన సొంత పార్టీతోనే పోరాడలేని అత్యంత బలహీనమైన స్థితికి దిగజారిపోయారు.

ఉపఎన్నికల ఫలితాలతో క్లారిటీ

ఈ రాజకీయ పతనానికి నిన్న మొన్నటి ఉపఎన్నికల ఫలితాలే తిరుగులేని నిదర్శనంగా నిలిచాయి. కేంద్ర ఎన్నికల సంఘం పార్టీ గుర్తును స్తంభింపజేసి తాత్కాలిక ఏర్పాట్లు చేసిన తర్వాత.. తన సొంత పేరునే పెట్టుకుని మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ పేరిట బరిలోకి దిగినప్పటికీ ప్రజలు ఆమెను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఒకప్పుడు బెంగాల్ రాజకీయాలను శాసించిన ప్రజా నాయకురాలి పార్టీకి నియోజకవర్గాల్లో కనీసం మూడు వేల ఓట్లు కూడా రాలేదంటే, క్షేత్రస్థాయిలో ఆమె ప్రజాదరణ ఎంతటి పాతాళానికి పడిపోయిందో స్పష్టమవుతోంది. కార్యకర్తల యంత్రాంగం తిరుగుబాటు వర్గం వెంటే నడవటం, సాధారణ ఓటర్లు సైతం మమత గ్రూపును ఏమాత్రం నమ్మకపోవడంతో ఆమె పార్టీ అస్తిత్వమే ప్రశ్నార్థకంగా మారింది. సొంత నేతలే వెన్నుపోటు పొడిచారన్న సానుభూతి కూడా ప్రజల్లో కనీస ప్రభావం చూపలేకపోయింది.

సానుభూతి కూడా చూపని ప్రజలు

ఇకపై ఒంటరిగా పోరాడి పార్టీని నిలబెట్టుకోవడం మమతా బెనర్జీకి అసాధ్యమైన పనిగా మారింది. ఎంపీల్లో ఎక్కువ మంది ఇప్పటికే బీజేపీ వైపు , ప్రత్యేక కూటముల వైపు కదలడం, బెంగాల్ అసెంబ్లీలో రెబెల్ నేతలే కీలకంగా మారడంతో మమత గ్రూపు కేవలం ఒక చిన్నపాటి అసమ్మతి గ్రూపుగా మిగిలిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో తన స్వతంత్ర అస్తిత్వాన్ని కాపాడుకోవాలని చూస్తే రాజకీయంగా పూర్తిగా కనుమరుగైపోవడం ఖాయం. అందువల్ల, గతంలో తృణమూల్ ఆవిర్భావానికి మూలమైన కాంగ్రెస్ పార్టీ వైపు మమత మళ్లీ చూడక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. తాను స్థాపించిన పార్టీ చీలిక వర్గం చేతుల్లోకి వెళ్లిపోవడాన్ని చూస్తూ కూర్చోవడం కంటే, మిగిలిన తన బలాన్ని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడమే ఆమెకు మిగిలిన ఏకైక గౌరవప్రదమైన మార్గంగా కనిపిస్తోంది.

కాంగ్రెస్‌లో విలీనమే మంచిది!

కాంగ్రెస్‌లో విలీనం ద్వారానే మమత జాతీయ స్థాయిలో తన గుర్తింపును కొంతవరకైనా కాపాడుకునే అవకాశం దక్కుతుంది. రాష్ట్రంలో విస్తరిస్తున్న బీజేపీని, తిరుగుబాటు తృణమూల్ వర్గాన్ని ఏకకాలంలో ఢీకొట్టే సంస్థాగత బలం ప్రస్తుతం మమత వద్ద లేకపోవడంతో.. జాతీయ పార్టీ గొడుగు కింద చేరితేనే మనుగడ సాధ్యమవుతుంది. కాంగ్రెస్‌తో కలవడం వల్ల కనీసం బెంగాల్‌లో లౌకిక ఓటు బ్యాంకును కొంతవరకైనా ఏకం చేయగలగడమే కాకుండా, కేంద్ర స్థాయిలో విపక్షాల కూటమిలో బలమైన స్వరాన్ని కొనసాగించవచ్చునని భావిస్తున్నారు. మరి మమతా బెనర్జీ ఏం సాధిస్తారో ?

పనితీరుపై రేవంత్ నజర్...

హైదరాబాద్, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్న తరుణంలో.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆత్మపరిశీలనకు సిద్ధమైంది. ప్రభుత్వ పాలనపై, ముఖ్యంగా నేతల పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు అత్యంత రహస్యంగా పావులు కదుపుతోంది. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, జీహెచ్ఎంసీ సహా పలు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇంటెలిజెన్స్ ద్వారా క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రజా నాడిని ముందుగానే పట్టుకుని, లోపాలను సరిదిద్దుకోవడానికి ప్రభుత్వం సర్వే చేయిస్తున్నట్లు తెలుస్తోంది.సాధారణంగా ఏ ప్రభుత్వమైనా అధికారంలోకి వచ్చాక తమ పథకాలు ప్రజలకు ఎంతవరకు చేరుతున్నాయి.. తమ పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారు.. అనే అంశాలపై ఎప్పటికప్పుడు థర్డ్ పార్టీల ద్వారా నిఘా పెడుతుంటాయి. అయితే.. రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం ఏకంగా ఇంటెలిజెన్స్ యంత్రాంగాన్ని రంగంలోకి దించింది. ప్రభుత్వ పనితీరుపై క్షేత్రస్థాయిలో లోతుగా ఆరా తీస్తోంది. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్ల వారీగా ఈ సర్వేను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈ సర్వేలో కేవలం ప్రభుత్వం, ముఖ్యమంత్రి పనితీరు మాత్రమే కాకుండా, స్థానిక ఎమ్మెల్యేల పనితీరు, మంత్రుల పాలనా శైలిపై కూడా ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజలు ఏమనుకుంటున్నారు.. ఏ ఏ పథకాలపై సానుకూలంగా ఉన్నారు? వేటిపైన అసంతృప్తితో ఉన్నారు.. లాంటి అంశాలను గుర్తించి.. సరిదిద్దుకోవడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.గత ఎన్నికల హామీల అమలు, సంక్షేమ పథకాల లబ్ధి అర్హులందరికీ అందుతున్నాయా లేదా అనే అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవడం ద్వారా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సర్కార్ భావిస్తోంది. ఈ సర్వేలో ప్రజలను ప్రధానంగా అయిదు నుంచి ఏడు రకాల కీలక అంశాలపై ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం, ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యేల పనితీరుతో పాటు, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే బాగుంటుంది? ఒకవేళ కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే



దానికి గల కారణాలు ఏమిటి? అనే ప్రశ్నలను సంధించడం ద్వారా ప్రతిపక్షాల వైపు ప్రజల మొగ్గు ఎలా ఉందో అంచనా వేయాలని చూస్తున్నారు. ముఖ్యంగా హైడ్రా పనితీరు, ఉచిత పథకాలు, విద్యుత్ కోతలు, నిరుద్యోగ సమస్య, ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లు వంటి సమస్యాత్మక అంశాలపై ప్రజల స్పందనను ఇంటెలిజెన్స్ వర్గాలు కూలంకషంగా సేకరిస్తున్నట్లు సమాచారం.ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలు ఎంతవరకు జనాల్లోకి వెళ్లాయనే కోణం లోనూ ఈ సర్వే వివరాలు రాబడుతోంది. అదే సమయంలో, కొన్ని వర్గాల ను ంచి వస్తున్న వ్యతిరేకత, ఉచితాలకు వ్యతిరేకంగా ఉన్న అభిప్రాయాలు, సంక్షేమ పథకాల అమలులో ఉన్న లోపాలను గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపట్టడానికి ఈ డేటా ప్రభుత్వానికి అత్యంత కీలకం కానుంది. ఎన్నికల సమయానికి ముందే ప్రజా వ్యతిరేకతను తగ్గించి, పాలనను గాడిలో పెట్టడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ ఇంటెలిజెన్స్ సర్వేను ఒక అస్త్రంగా మలుచుకుంటున్నట్లు స్పష్టమవుతోంది.

బీఆర్ఎస్ ప్రాదేశిక ఎన్నికల వ్యూహం... దసరా తర్వాత రంగంలోకి అధినేత కేసీఆర్



హైదరాబాద్,రాష్ట్రంలో ప్రాదేశిక ఎన్నికల వ్యూహంలో ప్రధాన ప్రతిపక్షంగా పైచేయి సాధించాలన్న గట్టి పట్టుదల బీఆర్ఎస్‌లో కనిపిస్తోంది. అందుకోసం అగ్రనేతలు మధ్య భారీ కసరత్తు జరుగుతోంది. దసరా తర్వాత అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రంగంలోకి దిగుతారన్న ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. తెలంగాణ భవన్‌లో కనిపించే నేతల నుంచి ధీమా వ్యక్తమవుతోంది. జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల్లో పైచేయి సాధించడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధమవుతోంది. సీఎం సహా మంత్రుల నియోజకవర్గాలే టార్గెట్‌గా బహిరంగ సభలు, బస్సు యాత్రలు నిర్వహించాలని కీలక నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.ఆ దిశగా రాష్ట్ర స్థాయి నాయకులు, జిల్లా, నియోజకవర్గం, మండల, గ్రామ స్థాయిల్లో కేడర్‌ను సంసిద్ధం చేస్తున్నారు. రాజకీయ భీష్ముడిగా పేరున్న కేసీఆర్ ప్రణాళికలు అనూహ్యంగా ఉంటాయన్నది అందరికీ తెలిసిందే.. కానీ త్వరలోనే జరగనున్న ప్రాదేశిక ఎన్నికలు 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు రెఫరెండమేనని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఒకటి, రెండు కాదు.. అనేక అంశాల్లో అధికార ప్రతిపక్షాల మధ్య యుద్ధ వాతావరణం కొనసాగుతున్న క్రమంలో సాధారణ ఎన్నికలు గతానికి పూర్తి భిన్నంగా ఉంటాయని జోరుగా చర్చ జరుగుతోంది. రాజకీయ పరిస్థితులు ఎంత భిన్నంగా ఉన్నా.. వాటిని అనుకూలంగా మలుచుకోవడంలో కేసీఆర్‌ది అందవేసిన చెయ్యి అనేది గత అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి.గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల తరహాలోనే 90శాతానికి పైగా జిల్లా పరిషత్, మండల పరిషత్‌లలో పాగా వేస్తామన్న అధికార కాంగ్రెస్ రాజకీయ ఎత్తుడగలకు భిన్నంగా బీఆర్ఎస్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. కత్తులు నూరుతున్న కాంగ్రెస్, బీజేపీలకు అందనంత ఎత్తులో కేసీఆర్ పొలిటికల్ మాస్టర్ ప్లాన్‌తో సంసిద్ధమై ఉన్నట్లు ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత అనుభవాలను గుణపాఠంగా విజయమే లక్ష్యంగా దూసుకుపోవాలని అధినేత ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంఛార్జీలకు స్పష్టమైన సంకేతాలు పంపించినట్లు తెలుస్తోంది.గత కొంత కాలంగా జిల్లా కమిటీలతో ఆయన నిరంతరం మాట్లాడుతూ క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ప్రజాక్షేత్రంలో పార్టీలుగా బలబలాలు, గెలుపోటములను భేరీజు వేస్తున్నారు. త్వరలోనే వారందరితో మీటింగ్ పెట్టి ధైర్యాన్ని నూరియనున్నారు. దీంతో ముందస్తు ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు నియోజకవర్గస్థాయి కమిటీలు అన్ని కోణాల్లో సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే ఎమ్మెల్యేలంతా లోకల్ ఎలక్షన్ మూడ్‌లోకి వెళ్ళిపోయారు. కేసీఆర్ స్పష్టమైన విధానాన్ని ప్రకటించినా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంఛార్జీలు అభ్యర్థులను బరిలోకి దింపే విషయంలో అంతర్గత కసరత్తు ముమ్మరం చేశారు. మరోవైపు పోటీ చేసేందుకు ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపిక కసరత్తు జోరుగా సాగుతోంది.పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న స్థానిక నేతలకే ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఈ ప్రాదేశిక ఎన్నికల్లో గెలిచే పరిస్థితి ఉందా? లేదా? తమపై నియోజకవర్గ ప్రజల్లో ఏ స్థాయిలో వ్యతిరేకత ఉంది.? అనే విషయాలపై బాద్యుల ద్వారా సర్వేలు కూడా నిర్వహిస్తున్నారు. తమతమ నియోజకవర్గాల్లో మెజారిటీ సంఖ్యలో ఎంపీటీసీలు, జడ్పీటీసీలను గెలిపించుకుంటేనే వచ్చే సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యే టిక్కెట్ ఖాయమన్న కోణంలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు బలాన్ని నిరూపించుకోవాలన్న పట్టుదలతో ఉన్నారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి ఏ విధంగా ఉంది? జనాల్లో తమపై ఎటువంటి అభిప్రాయాలు ఉన్నాయి? ఏఏ విషయాల్లో వ్యతిరేకత ఉంది? అనే విషయాలపై సర్వేల ద్వారా ఆరా తీస్తూ జాగ్రత్త పడుతున్నారు. ఇప్పటికే కొన్ని సర్వే సంస్థలకు చెందిన వ్యక్తులు ప్రజలకు నేరుగా ఫోన్ చేసి ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది? ప్రభుత్వం పట్ల మీ అభిప్రాయం ఏమిటి? సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యేలపై మీకున్న అభిప్రాయం ఏమిటి? అన్న కోణంలో సమాచారం సేకరిస్తున్నారు. ధర్డ్ పార్టీ సమాచారం పక్కాగా ఉంటుందన్న కోణంలో ఈ తరహా అనేక విషయాలపై ఆరా తీస్తున్నారు.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140